

గాలివాన బీభత్సం

- పిడుగు పడి ఎద్దు మృతి

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం మండలంలో గాలివాన బీభత్సం సృష్టించింది. పిడుగు పడి ఎద్దు మృతి చెందగా మిరప, వరి పంట వర్షపు నీటిలో మునిగిపోయాయి. శుక్రవారం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఉరుకుంద గ్రామానికి చెందిన అల్లయ్య అనే రైతు తన ఎద్దును చెట్టుకు కట్టేయగా పిడుగుపాటు దెబ్బకు అక్కడికక్కడే మృతి చెందింది. కౌతాళం, ఉరుకుంద మధ్యలో రైతులు మిరప పంటను పొలాల్లో ఆరబెట్టారు. అకాలంగా కురిసిన వర్షానికి ఆ పంటలు తడిసి ముద్దయ్యాయి. వర్షపు నీటిలో కొట్టుకుపోకుండా రైతులు తమ పంటలను కాపాడుకోడానికి అనేక కష్టాలు పడ్డారు.



తడిసిన మిర్చిని ఎత్తుతున్న రైతులు

రైతులకు, కార్మికులకు

ప్రమాద బీమా ఇవ్వాలి

- చనిపోయిన వారికి రూ.10 లక్షల పరిహారమివ్వాలి - సిఐటియు ఆధ్వర్యంలో మార్కెట్ కార్యాలయం ముందు ధర్నా

- 24 గంటల్లో వసతుల ఏర్పాటుకు చైర్మన్ హామీ

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

కర్నూలు వ్యవసాయ మార్కెట్ లో బుధవారం అనంతపురం రైతు, గురువారం ఉల్లిగడ్డల పట్టుబడి హమాలి సర్వేశ్వరరెడ్డి ఎండ తీవ్రత వల్లే మృతి చెందారని తక్షణమే వారికి రూ.10 లక్షల నష్టపరిహారం అందించాలని, మార్కెట్‌లో ఎండ తీవ్రత వసతులు కల్పించాలని కోరుతూ శుక్రవారం సిఐటియు మార్కెట్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు అధ్యక్షతన ధర్నా చేశారు. ఈ ధర్నా కు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గౌస్‌దేశాయ్, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, హమాలి యూనియన్ల గౌరవాధ్యక్షులు రాముడు, మార్కెట్ హమాలి యూనియన్ల గౌరవాధ్యక్షులు టి.రాముడు హాజరయ్యారు. ఈ ధర్నాకు ముందుగా మార్కెట్‌లో ర్యాలీ నిర్వహించి దాదాపు 500 మంది కార్మికులతో మార్కెట్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ ధర్నాను ఉద్దేశించి గౌస్ దేశాయ్ , పిఎస్. రాధాకృష్ణ మాట్లాడుతూ మార్కెట్‌లో రైతులకు హమాలీలకు ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోలేదని, మార్కెట్ అధికారులు, పాలకమండలి నిద్రావస్థలో ఉన్నారన్నారు. ఎండ తీవ్రతను తట్టుకోలేకనే బుధవారం రైతు, గురువారం హమాలి కార్మికుడు మృతి చెందరన్నారు. ఇంత వేసవి కాలంలో కనీసం జాగ్రత్తలు పాటించకపోవడం వల్లే ఈ మరణాలు సంభవించాయని, మార్కెట్ కార్యదర్శి నిర్లక్ష్యం వల్ల వారు మృతి చెందారని, ఈ మరణాలకు అధికారులు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించి రైతులను, హమాలీలను కాపాడాలని కోరారు. మార్కెట్ లో ఉన్న అధికార గోడౌన్లను వ్యాపారులకు ముట్టజెప్పి, రైతులు తెచ్చిన పంట ఉత్పత్తులు ఎండలో పెట్టించి దుర్మార్గమైన ఆలోచన చేస్తున్నారని మండిపడ్డారు. తాగు నీరు, చలువ పందిళ్ళ, మహిళలకు ,పురుషులకు మరుగుదొడ్లు తక్షణమే ఏర్పాట్లు చేయాలన్నారు. ఇప్పటిదాకా మార్కెట్‌లో ఆరుగురు హమాలీలు మతి చెందరన్నారు. ఎవ్వరికీ కూడా ఎలాంటి నష్టపరిహారం ఇప్పటిదాకా అందించలేదన్నారు. మార్కెట్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శి గోవిందు ధర్నా దగ్గరకు వచ్చి తాగునీరు, చలువపందిళు ,,మిర్చికి ట్యాంకర్లతో నీటి పంపింగ్ 24 గంటల్లో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇంకా రైతులకు హమాలీలకు చేయాల్సిన అన్ని రకాల సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. సిఐటియు నాయకులు యేసు పాల్గొన్నారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయి

బడిబయట ఉన్న పిల్లల వివరాలు సేకరించాలి

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జూన్ 1 నాటికి సచివాలయం వారీగా బడి బయట ఉన్న పిల్లల సంఖ్య వివరాలను సేకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుండి విద్యాశాఖకు సంబంధించిన పలు అంశాలపై ఎంపిడిఒలు ఎంఇఒలు,జిల్లా అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎంత మంది బడి బయట పిల్లలు విద్యార్థులు ఉన్నారో సచివాలయం వారీగా వివరాలు సేకరించాల న్నారు. ఎంపిడిఒలు, ఎంఇఒలు, టీచర్లు, సిఆర్‌పిలు , డిజిటల్ అసిస్టెంట్లు ఈ బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వలసలు వెళ్లారంటే కుదరదని, వలసలు వెళ్ళి ఉంటే ఎక్కడికి వెళ్లారు? ఏం చేస్తున్నారు? పొలం పనులు చేస్తున్నారా? స్కూల్ కి వెళ్తున్నారా, చదువు మానేసి పిల్లలను చూసుకుంటున్నారా, అడుక్కుంటున్నారా, ఇలాంటి వివరాలన్నీ కచ్చితంగా సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. పిల్లలందరూ బడిలో మాత్రమే ఉండాలన్నారు. ఐరన్ టాబ్లెట్స్ తక్కువగా పంపిణీ చేసిన హలహర్వి, కౌతాళం, కోడుమూరు, ఆదోని ఎంఇఒలు సరైన రీతిలో పంపిణీ చేయకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. జగనన్న విద్యా కానుకకు సంబంధించిన కిట్లు మే 30 తేది లోపు మండల లెవెల్ స్టాక్ పాయింట్ కు వస్తుందన్నారు. జూన్ 1 నుంచి 11వ తేది వరకు పాఠశాలకు పంపిణీ చేసేలా సరైన రీతిలో ప్రణాళికను రూపొందించాలని డిఇఒ, ఎస్-ఎస్ఎ పిఓను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, డిఇఒ రంగారెడ్డి, ఎస్ఎస్ఎ పిఓ వేణుగోపాల్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.




కాయ్..రాజా కాయ్...

- జోరందుకున్న బెట్టింగ్ పర్వం - ఆర్థికంగా నష్టపోతున్న యువత

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఐపిఎల్ సీజన్ వచ్చిందంటే యువతలో జోరు అంతా.. ఇంతా కాదు. ఆ జోరును బెట్టింగ్ బుకీలు క్యాష్ చేసుకుంటున్నారు. మ్యాచ్‌లో సాగే బంతి బంతికీ పందేలు కాస్తున్నారు. ఐపిఎల్ ప్రారంభం రోజున కొన్ని ప్రాంతాల్లో మాత్రమే మొదలైన క్రికెట్ బెట్టింగ్ ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లోనూ ఊపందుకుంది...

తొలుత క్రికెట్ అంటే మానసికోల్లాసం కోసం, క్రీడా స్ఫూర్తి కోసమే ఆడేవారు. నేడు అది జూద క్రీడగానూ మారిపోయింది. గతంలో పట్టణాలకే పరిమితమైన 'బెట్టింగ్ ఫీవర్' నేడు మండల కేంద్రాలతో పాటు మారుమూల గ్రామాలకూ విస్తరించింది. వ్యవహారమంతా సెల్‌ఫోన్లలోనూ, ఆన్‌లైన్లలోనే సాగుతోంది. ప్రత్యేకంగా సెల్‌ఫోన్లు కొనుగోలు చేసుకుని తమ పేర్లతో లేని సిమ్ కార్డులను యువత బెట్టింగ్ కోసం వినియోగిస్తున్నారు. రూ.100 కాస్తే రూ.150, రూ.200 ఇస్తామంటూ బుకీలు ఆశ చూపి యువతను బెట్టింగ్ ఊబిలోకి లాగుతున్నారు. దాంతో యువత బెట్టింగ్‌లో బిజీబిజీ అయిపోయారు. మ్యాచ్ మొదలవడానికి రెండు, మూడు గంటల ముందే వాట్సప్, మెసేజ్, ఫోన్ కాల్స్, ఇంటర్నెట్‌లో యువత బెట్టింగ్‌ను హోరెత్తిస్తున్నారు. చివరికి సర్వం కోల్పోయి వీధిన పడుతున్నారు. మ్యాచ్ ముగిశాక నగదు పంపిణీలో తేడాలు వస్తుండడంతో విద్యార్థుల్లోనూ, యువతలోనూ గొడవలు తలెత్తి పోలీసు స్టేషన్లలో పంచాయితీల వరకూ వెళ్తుండడం గమనార్హం. బెట్టింగ్ ద్వారా రాష్ట్రంలో రోజుకు రూ.కోట్లు చేతులు మారుతోంది. సాయంత్రమైతే చాలు గ్రామాల్లో ఇదే చర్చ జరుగుతోంది. 'ఈ రోజు ఏ జట్ల మధ్య మ్యాచ్ ఉంది. ఎవరెవరు ఆడుతున్నారు. ఏ జట్టుపై పందెం కాయాలి. ఎంత కాస్తే మనకెంత వస్తుంది' అంటూ యువత ఫోన్లలో సంభాషణలు సాగిస్తున్నారు. పాఠశాల విద్యార్థుల మొదలు వృద్ధుల వరకూ అందరూ ఈ బెట్టింగ్ వ్యవహారంలో పాలుపంచుకుంటున్నారు. మ్యాచ్ ఎవరు గెలుస్తారనే పందెంతో పాటు టాస్ ఎవరు గెలుస్తారన్నదీ నేడు పందెంగా మారిపోయింది. ఈ బంతికి ఎంత స్కోర్ కొడతారనే పందెమూ నేడు అధికంగా సాగుతోంది. తెలియని అమాయక యువత అదృష్టం ఉంటే రూ.లక్షలు సంపాదించుకోవచ్చనే క్షణికావేశంతో బెట్టింగ్ వేసి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ప్రధాన ప్రాంతాల్లో ఉండే బెట్టింగ్ బుకీలు ఆయా ప్రాంతాల వారీగా మధ్యవర్తులను నియమించుకుని వారి ద్వారా బెట్టింగ్ తతంగాన్ని నడిపిస్తున్నారు. స్ట్రైట్, రైసింగ్, 30, 50, ఎస్, ఓకే, డన్ వంటి కోడ్‌లను ఉపయోగిస్తూనే ఈ బెట్టింగ్ అంతా సాగుతోంది. కర్నూలు, ఆదోని, నంద్యాల పట్టణాల్లో లాడ్జీలలో ఈ బెట్టింగ్ తంతు సాగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో స్కూళ్ల మైదానాల్లో సాయంత్రం పూట యువత చేరి బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు. క్షేత్రస్థాయిలో పోలీసులు బెట్టింగ్‌కు పాల్పడుతున్న యువతకు కౌన్సెలింగ్ ఇవ్వడం కూడా ఎక్కడా కనిపించడం లేదు. బెట్టింగ్ ద్వారా ఓ వైపు బుకీలు రూ.లక్షలు, రూ.కోట్లలో సంపాదిస్తుంటే యువత మాత్రం అప్పు చేసి మరీ బెట్టింగ్ కాస్తూ ఆర్థికంగా చితికిపోతున్నారు. ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయి.



ఎమ్మిగనూరులోకి యువగళం...

- లోకేష్‌కు అపూర్వ స్వాగతం

ప్రజాశక్తి-నందవరం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 83వ రోజు ఎమ్మిగనూరు నియోజకవర్గంలోకి ప్రవేశించింది. ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బివి.జయనాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు, అభిమానులు ఇబ్రహీంపురం శివార్లలో ఘనస్వాగతం పలికారు. మధ్యాహ్నం భోజన విరామం అనంతరం వర్షంలోనూ యువనేత పాదయాత్ర కొనసాగించారు. లోకేష్‌ను చూసేందుకు మాచాపురం, నందవరంలో భారీగా ప్రజలు రోడ్లపైకి వచ్చారు. అందరినీ ఆప్యాయంగా పలకరించిన లోకేష్ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. భోజన విరామానికి ముందు ఇబ్రహీంపురం శివార్లలో అకాల వర్షాల కారణంగా తడిసిపోయిన మిర్చి కళ్లాలను పరిశీలించి రైతుల కష్టాలు తెలుసుకున్నారు. తర్వాత రైతు కూలీలతో మాట్లాడి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో మాచాపురంలో రైతులతో సమావేశమయ్యారు. సాయంత్రం నందవరం రైతులు, దళితులు, మాచాపురం, నదికైరవాడి గ్రామస్తులు లోకేష్‌ను కలిసి తమ సమస్యలను తెలియజేశారు. అనంతరం యువగళం పాదయాత్ర నందవరం శివారులోని విడిది కేంద్రానికి చేరుకుంది. శుక్రవారం మొత్తంగా లోకేష్ 14.2 కిలోమీటర్ల పాదయాత్ర చేశారు. ఇప్పటివరకు 1073.9 కిలోమీటర్ల పాదయాత్ర పూర్తి చేశారు. గుడికంబాల రీచ్ నుంచి రాష్ట్రేతర ప్రాంతాలకు తరలివెళ్తున్న ఇసుక లారీ ఎమ్మెల్యే విషనాగు ఇసుక దోపిడీకి ప్రత్యక్ష సాక్షి అని యువనేత నారా లోకేష్ వ్యాఖ్యానించారు. మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ, మాజీ ఎమ్మెల్సీ బిటి.నాయుడు, జడ్‌పి మాజీ వైస్ ఛైర్మన్ పుష్పవతి, టిడిపి మండల నాయకులు ఈరన్న గౌడ్, వెంకట రామిరెడ్డి, గడ్డం నారాయణరెడ్డి, నాగరాజు గౌడ్, ఖాసీం వలీ, బండే గురు స్వామి, కన్వీనర్ చిన్న రాముడు, టిడిపి రైస్ మిల్ నారాయణరెడ్డి, గోపాల్, శంకరమ్మ పాల్గొన్నారు.

బయటపడిన గ్రూపు విభేదాలు..

సాక్షాత్తు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సాక్షిగా మరోసారి గ్రూపు విభేదాలు బయటపడ్డాయి. మాజీ ఎమ్మెల్యే బివిజెకు దూరంగా ఉన్న టిడిపి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు నాగరాజు గౌడు బివి చెంతకు చేరడంతో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాధవ రావు దేశాయి బివి.జయనాగేశ్వర రెడ్డితో విభేదించి ఆయనకు దూరంగానే ఉంటూ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో మాధవ రావు ఎక్కడా బివి.జయ నాగేశ్వర రెడ్డి ఫొటో లేకుండానే భారీ ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకున్నారు. మండలంలోని అసమ్మతి నాయకుల అనుచరులను భారీ ఎత్తున చేర్చుకొని నందవరంలో ఎస్సీ కాలనీ నుంచి నారా లోకేష్ పాదయాత్రలో పాల్గొన్నారు. అసమ్మతి నాయకుల మధ్య ఏదైనా జరుగుతుందేమో అని నాయకులు, కార్యకర్తలు భయాందోళనలకు గురైన సమయంలో మాధవ రావు దేశాయిని నారా లోకేష్‌కు బివి పరిచయం చేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అక్కడి నుంచి మునిస్వామి టాకీస్ దగ్గర రాత్రి బస శిబిరం వరకు ఇద్దరు కలిసి నారా లోకేష్ వెంట నడిచారు.



వర్షాన్ని సైతం లెక్క చేయకుండా పాదయాత్ర నిర్వహిస్తున్న నారా లోకేష్



పాణ్యంలో టిడిపి జెండాను ఎగరేద్దాం

ప్రతి కార్యకర్త సైనికునిలా చేయాలి -ఆర్ టిఎస్ కార్యకర్తల శిక్షణలో గౌరు దంపతులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రతి కార్యకర్త సైనికులుగా పని చేసి పాణ్యంలో టిడిపి జెండాను ఎదురవేద్దామని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డి, పాణ్యం ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని దేవి ఫంక్షన్ హాలులో టిడిపి పాణ్యం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలకు ఆర్‌టిఎస్ శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమం లో ఆర్‌టిఎస్ ట్రైనర్లు మధు సుధాకర్, సుహెల్‌రాబా, మహబూబ్‌బాషా, పాణ్యం నియోజకవర్గ కల్లూరు అర్బన్, ఓర్వకల్లు, కల్లూరు, గడివేముల, పాణ్యం మండలాల క్లస్టర్ ఇంచార్జిలు, యూనిట్ ఇంచార్జిలు, బిఎల్‌ఎలు, మండలాల గ్రామ ముఖ్య నాయకులు, అనుబంధ విభాగాల సభ్యులు పాల్గొన్నారు. గౌరు చరిత మాట్లాడుతూ ఆర్‌టిఎస్ శిక్షణలో విధి విధానాల గురించి తెలుసుకుని తూచా తప్పకుండా పాటించాలన్నారు. ప్రతి కార్యకర్త సైనికులుగా పనిచేసి 2024 ఎన్నికల్లో పాణ్యం నియోజకర్గంలో టిడిపి జెండాను ఎగురవేయాలని అన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర వచ్చే వారంలో పాణ్యం నియోజకర్గంలో కొనసాగుతుందని తెలిపారు. ఈ పాదయాత్రను నియోజకవర్గ, మండల గ్రామ నాయకులు, కార్యకర్తలు టిడిపి అభిమానులు తప్పకుండా ప్రతి ఒక్కరూ తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

మేడేను పురస్కరించుకుని ఆటల పోటీలు

ప్రజాశక్తి- కర్నూలు స్పోర్ట్స్



మాట్లాడుతున్న ప్రసాద్‌శర్మ

సుందరయ్య స్ఫూర్తి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మేడేను పురస్కరించుకొని వివిధ ప్రజా సంఘాల నుంచి స్ఫూర్తి దాయకమైన స్పందన ఉంది. ఇం దులో భాగంగా శుక్రవారం ఓల్డ్ సిటీ హమాలి సంఘాల మధ్య క్రికెట్ పోటీలు నిర్వహించారు. వివిధ కార్మిక సంఘాలు ఆటో రివర్స్ గేర్ పోటీలను ఐక్యంగా సిఐటియూ ఆధ్వర్యంలో ఖండేరి తుంగభద్ర ప్రాంతంలో నిర్వహించారు. ఈ పోటీలలో చాలా ఉత్సాహంగా దాదాపు 40 మంది కార్మికులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సుందరయ్య స్ఫూర్తి విజ్ఞాన కేంద్రం నాయకులు ప్రసాద్‌శర్మ, విజయ్‌కుమార్, రవి, మహిమూద్ తదితరులు పాల్గొని వివిధ శాఖల కార్మికులకు పోటీలు నిర్వహించారు..

నేడు మహాకవి శ్రీ శ్రీ జయంతి

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

మహాకవి శ్రీశ్రీ జయంతి సభ ఈనెల 29న శనివారం సాయంత్రం 6-00 గంటలకు సిక్యాంపు లలిత కళా సమితిలో ఉంటుందని సాహితీస్రవంతి రాష్ట్రకార్యదర్శి జంధ్యాల రఘుబాబు, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం కన్వీనర్ జెయన్ శేషయ్య తెలిపారు. శుక్రవారం ప్రజాశక్తితో వారు మాట్లాడారు. మరో ప్రపంచం, మరో ప్రపంచం పిలిచింది, పదండి ముందుకు, పదండి తోసుకు అంటూ తెలుగు సాహిత్యాన్ని ఉరకలెత్తించిన మహాకవి శ్రీశ్రీ తెలుగు సాహిత్యంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. తెలుగు కవిత్వంలో ఈ యుగం నాది అని ప్రకటించిన శ్రీ శ్రీ, వీరేశలింగం, గురజాడ మెదలైనవారు వేసిన కవితా మార్గాన్ని తాము ముందుకు తీసుకువెళ్తున్నామన్నారు. నేడు దేశంలో చోటుచేసుకుంటున్న సామాజిక, రాజకీయ ఆర్థిక రుగ్మతలపై శ్రీ శ్రీ స్ఫూర్తితో పోరాటం నిర్వహించాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. అందుకే ప్రగతిశీల శక్తులను, ఆలోచనా పరులను, విద్యార్థులు, యువతను భాగస్వాములను చేస్తూ వ్యాసరచన పోటీలు, పాటల పోటీలు, డ్యాన్స్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కర్నూలు నగరంలోని అన్ని డిగ్రీ ప్రొఫెషనల్ కాలేజిలలో ఈనెల 26, 27 తేదీలలో విద్యార్థులకు "శ్రీ శ్రీ సాహిత్యం - సమాజంపై ప్రభావం" అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. పాటల పోటీలు 28 ఉదయం 10 గంటలకు కర్నూలు సి. క్యాంప్ సెంటర్, లలిత కళా సమితి మినీ హాలు నందు శ్రీ శ్రీ వ్రాసిన పాటల పోటీలు డ్యాన్స్ పోటీలు నిర్వహించామన్నారు. 29న ఉదయం 10 గంటలకు కర్నూలు సి. క్యాంప్ సెంటర్, లలిత కళా సమితి ఆడిటోరియంలో శ్రీ శ్రీ రాసిన పాటలకు డ్యాన్స్ పోటీలు ఉంటాయన్నారు. సాయంత్రం 6 గంటలకు లలిత కళా సమితి ఆడిటోరియంలో శ్రీశ్రీ 113వ జయంతి సభ ఉంటుందన్నారు.

ముఖ్య అతిథులుగా ప్రముఖరాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి, విద్యార్థి యువజన నాయకులు పి.తిక్కారెడ్డి, విద్యార్థి, యువజన సంఘాల పూర్వ నాయకులు డాక్టర్ బి. శంకరశర్మ, ప్రముఖవిద్యావేత్త జి.పుల్లయ్య, కర్నూలు ప్రముఖవైద్యులు డాక్టర్ బి.భరత్ పాల్గొంటారన్నారు. పోటీలలో గెలుపొందిన వారికి సభలో బహుమతి ప్రదానం , సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.



శ్రీశ్రీకి నివాళ్లు అర్పిస్తున్న స్పెషల్ కలెక్టర్ మల్లికార్జునుడు, తదితరులు

కష్టజీవుల పక్షపాతి శ్రీశ్రీ : మల్లికార్జునుడు

శ్రమైక జీవన సౌందర్యానికి మించినది లేదని చెప్పిన శ్రీరంగం శ్రీనివాసరావు కష్టజీవుల, ఖర్మవీరుల పక్షపాతి అని కర్నూలు స్పెషల్ కలెక్టర్ మల్లికార్జునుడు పేర్కొన్నారు. శ్రీశ్రీ జయంతి సందర్భంగా కర్నూలు లలిత కళా సమితి మినీహాలులో శ్రీశ్రీ రచించి పాడిన పాటలపోటీలను ప్రారంభించి ఆయన మాట్లాడారు. శ్రీశ్రీ రచనల గొప్పతనాన్ని వివరించారు. న్యాయవాది రామ సుబ్బారెడ్డి మాట్లాడుతూ శ్రీశ్రీ మార్క్సిస్టు వాదిగా తన కవిత్వం ద్వారా ఒక వ్యక్తిని మరోవ్యక్తి ఒకజాతిని మరోజాతి పీడించే సాంఘీక ధర్మం ఇంకానా ఇకపై సాగవు అంటూ హెచ్చరించిన అభ్యుదయ వాది అన్నారు. సాహితీస్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు మాట్లాడుతూ శ్రీశ్రీ పాటలను ఉదహరించి అవి సామాజిక చైతన్య దీపికలని అన్నారు. జెఎన్. శేషయ్య అధ్యక్షతన జరిగిన సభలో శ్రీశ్రీ చిత్రపటానికి డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడు, రామసుబ్బారెడ్డి, రఘుబాబు, ఎంపి బసవరాజు, ఎలమర్తి రమణయ్య,పార్వతయ్య, పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. లలిత కళాసమితి అధ్యక్షులు పత్తి ఓబులయ్య గాయనీ, గాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. పాటలపోటీలలో 35 మంది పాల్గొన్నారు. శ్రీశ్రీ రచించిన సినీ, అభ్యుదయ గీతాలను ఆలపించారు. న్యాయనిర్ణేతలుగా ఎలమర్తి రమణయ్య, పార్వతయ్య వ్యవహరించారు. సమన్వయ కర్తలుగా ఎంపి బసవరాజు, శిరీష, ఆశన్న, శ్రీను వ్యవహరించారు.

డ్రైనేజీగా మారిన లక్ష్మీ నగర్ రోడ్లు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

వర్షం కురిసి రెండు రోజులయినా 24వ వార్డ్ లక్ష్మి నగర్ వీధి రోడ్లపై డ్రైనేజీ కాలువ నీరు పారుతుందని సిపిఎం వార్డు కార్యదర్శి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల బాధలను ఎమ్మెల్యే, మేయర్, కార్పొరేషన్ అధికారులు పటించుకోవడం లేదన్నారు. లక్ష్మి నగర్ ప్రజల బాధలు కష్టాలు తీరటం లేదని వర్షం వచ్చినపుడల్లా మామూలు రోడ్లు డ్రైనేజీ రోడ్లు గా మారిపోయి చిన్నపిల్లల నుండి ముసలి వాళ్ళ వరకు, వాహనదారులు అవస్థలు పడుతున్నా కార్పొరేషన్ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తెచ్చినా పరిష్కారం కావడం లేదని తెలిపారు. అధికార,ప్రతిపక్షపార్టీలకు ఎన్నికలపుడే ఓటర్లు గుర్తుకు వస్తారని, తర్వాత ప్రజా సమస్యలపై కన్నెత్తి కూడా చూడక పోవటం శోచనీయ మన్నారు. కార్పొరేషన్ అధికారులు శుభ్రత, పరిశుభ్రత అంటూ ఊదరకొట్టే ప్రచారం చెత్త పన్ను వసూలు చేయటానికి బెదిరింపులపై ఉన్న శ్రద్ధ ప్రజాసమస్యలు పరిష్కరించటంలో లేదని విమర్శించారు. వార్డులో ప్రతి సంవత్సరం డెంగ్యూ, మలేరియా జ్వరాలకు గురి అవుతూ ప్రజలు వేల రూపాయలు వైద్యానికి ఖర్చు చేసుకొన్నారని, వెంటనే స్పందించి వీధిలో ఉన్న మురుగునీటిని తొలగించాలన్నారు.



చెరువును తలపిస్తున్న రోడ్డు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బివై.రామయ్య


లోకేష్‌ది అబద్ధాల యాత్ర : వైసిపి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్: నారా లోకేష్ జిల్లాలో చేస్తుంది పాదయాత్ర కాదని అబద్దాల యాత్ర అని కర్నూలు వైసిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు బివై.రామయ్య అన్నారు. శుక్రవారం స్థానిక బిర్లా కాంపౌండ్లోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి బిసిలకు చేసిందేమీ లేకపోయినా ఏదేదో చేసినట్లు నారా లోకేష్ తన పాదయాత్రలో అసత్య ప్రచారం చేస్తున్నారని బివై. రామయ్య మండిపడ్డారు. బిసిలకు వైసిపి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. బిసిలు తమ ప్రభుత్వంలో, టిడిపి ప్రభుత్వంలో ఎంత లబ్ది పొందారో చంద్రబాబు, లోకేష్ బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాలు విసిరారు. పనికిరాని మాటలతో టిడిపి ప్రభుత్వం బిసిలను వంచించినందుకే గత ఎన్నికల్లో చావుదెబ్బ కొట్టారని, అది లోకేష్ గుర్తు పెట్టుకోవలన్నారు. కేవలం బిసిల కోసమే రూ.10.60 వేల కోట్లను వైఎస్.జగన్ ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. లోకేష్ చేస్తున్నది పాదయాత్ర కాదు అబద్ధాల యాత్ర అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అన్ని కీలక పదవుల్లో అధికశాతం బిసిలు ఉన్నారని, కర్నూలు జిల్లాలో ఒక మంత్రి, మేయర్, ఎమ్మెల్సీలతో పాటు రాష్ట్ర, జిల్లా స్థాయి నామినేటెడ్ చైర్మన్, డైరెక్టర్ పదవుల్లో బిసిలు ఉన్నారనేది లోకేష్ తెలుసుకోవలన్నారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో ఉపాధి లేదనే లోకేష్ వ్యాఖ్యలను బివై. రామయ్య ఖండించారు. అక్కడ కొన్ని దశాబ్దాల నుంచి వలసలు వెళ్ళడం ఆనవాయితీగా వస్తుందని స్పష్టం చేశారు. వాటిని గత ప్రభుత్వాలు కూడా నివారించ లేకపోయాయన్నారు. ఈ నెల 26న మంత్రాలయం నియోజకవర్గంలో రైతుల సమావేశంలో లోకేష్ అన్ని అబద్దాలే ఆడారన్నారు.

రసాయన రహిత ఆర్గానిక్ ఫుడ్‌కు ఆమోదం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ :

రసాయన రహి త ఆర్గానిక్ ఫుడ్‌కు అంత ర్జాతీయ ఆమోదం పొం దిందని త్రిపుల్ ఐటిడిఎం డైరెక్టర్ ప్రొఫెసర్ సోమయాజులు పేర్కొన్నారు. విజయవాడలో శుక్రవారం ప్రారంభమైన గ్లోబల్ ఫుడ్ బాస్కెట్ 2023 వర్క్ షాపులో గ్లోబల్ టెక్నాలజీ ఇంటర్వెన్షన్స్ అండ్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ -ఫుడ్ వాల్యూ చైన్' అనే అంశంపై చర్చ కార్యక్రమం నిర్వహించారు. డైరెక్టర్ సోమయాజులు మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక ఆలంబనగా ఆహార పరిశ్రమ కొత్త రూపును సంతరించు కుంటుందన్నారు. రిజిస్ట్రార్ కె.గురుమూర్తి మాట్లాడుతూ చిన్న మధ్య తరహా పరిశ్రమల వారు తమ ఉత్పత్తుల పరంగా నవ్యత,నాణ్యతతో పాటుమెరుగైన అంతర్జాతీయ ప్రమాణాల మేరకు ప్యాకింగ్ ద్వారా వినియో గదారులను ఆకర్షించవచ్చన్నారు.



మాట్లాడుతున్న త్రిపుల్ ఐటి డిఎం డైరెక్టర్ సోమయాజులు

సచివాలయ సేవలను మెరుగుపరచాలి

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని



సచివాలయ పరిసరాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

సచివాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలను మెరుగుపరచాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఎస్‌కెడి కాలనీ 21వ వార్డు సచివాలయాన్ని ఆయన తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. పథకాలు, అందిస్తున్న సర్వీసు, సచివాలయం నుంచి జరిగే అభివృద్ధి కార్యక్రమాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడారు. సకాలంలో విధులకు హాజరుకావాలని సూచించారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వార్డు కౌన్సిలర్ లక్ష్మీదేవి కోరారు. శివ శంకర్ నగర్‌లోని సాయిబాబా గుడి వద్ద వంకపై కల్వర్టు ఎత్తు పెంచాలని, సచివాలయ భవనం నిర్మించాలని, పురాతన బావి చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని విన్నవించారు. కమిషనర్ రఘునాథ్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, మున్సిపల్ ఇంజినీర్ నాగభూషణం రెడ్డి, వార్డు ఇన్‌ఛార్జ్ చంద్రశేఖర్ రెడ్డి ఉన్నారు.

ప్రసవానికి ముందే ఆస్పత్రిలో చేర్పించండి

- జిల్లా వైద్యాధికారి రామగిడ్డయ్య

ప్రజాశక్తి - ఆదోని



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి రామ గిడ్డయ్య

గర్భిణులను ప్రసవానికి ముందే ఆస్పత్రిలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి రామగిడ్డయ్య ఎఎన్ఎంలను, హెల్త్ సూపర్‌వైజర్లను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సిల్వర్ జూబ్లీ హాలు ఆవరణలో డివిజన్‌లోని ఎఎన్ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్లకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనీమియా మానిటరింగ్ టూల్స్ యాప్‌లో గర్భిణులు, కిశోర బాలికలకు నిర్వహించిన రక్త పరీక్షల వివరాలను అప్‌లోడ్ చేయాలని తెలిపారు. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్స చేయించుకున్న వారిని ఫాలో అప్ చేస్తూ వారికి మెడిసిన్ అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 0-5 ఏళ్లలోపు పిల్లలు అంగన్వాడీ కేంద్రంలో ఉండేలా చూడాలని తెలిపారు. బరువు తక్కువ ఉన్న పిల్లలకు పోషకాహార పదార్థాలు అందేలా చూడాలని సదస్సుకు హాజరైన సిబ్బందిని ఆదేశించారు. బీపీ, మధుమేహం, రక్తహీనత, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఇంటి దగ్గరే ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా మందులు అందజేయాలన్నారు. ఒకవేళ సమస్య తీవ్రమైతే వారిని మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రికి తరలించాలని సూచించారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ సత్యవతి, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్, డిపిఎంఒ డాక్టర్ ఉమా, ఆర్‌బిఎస్‌కె జిల్లా కో ఆర్డినేటర్ హేమలత, ఫ్యామిలీ ఫిజీషియన్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ బాల మురళి, డిపిఒ విజయరాజు, ఎస్ఒ హేమ సుందర, డెమో శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు ఉపాధి కార్డులు ఉండాలి

- ఏపీడీ మల్లేశ్వరి

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రతి గ్రామంలో కూడా ఎస్సీ, ఎస్టీ కుటుంబాల వారందరికీ తప్పనిసరిగా ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉండేలా చూసుకోవాలని ఉపాధి హామీ సిబ్బందికి అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి మల్లేశ్వరి ఆదేశించారు. శుక్రవారం చిప్పగిరి మండల కార్యాలయంలో ఎంపిడిఒ సుధాకర్ రాజు అధ్యక్షతన ఎపిఓ మాధవ శంకర్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండలంలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు జాబ్ కార్డులు తక్కువగా ఉన్నాయని కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో ఉన్న ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు ఎస్సీ, ఎస్టీ కుటుంబాలను పరిశీలించి, ఇంటింటికీ వెళ్లి ఉపాధి హామీ జాబ్ కార్డులు లేని వారందరికీ చేయించాలని చెప్పారు. జాబ్ కార్డులు పొందిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని, పనులు కల్పించడంలో అలసత్వం వహించిన వారిపై తగిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రభుత్వం దినసరి వేతనం రూ.272 చేసిందన్నారు. వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'లండన్ మిషనరి భవనాన్ని ఆక్రమిస్తే చర్యలు'

- ఇన్‌ఛార్జి తహశీల్దార్ విజయ్‌కుమార్

ప్రజాశక్తి-ఆలూరు

మండలంలోని మొలగవల్లి కొట్టాల గ్రామంలో సర్వే నెంబర్ 179ఎలో ఉన్న లండన్ మిషనరీ భవనాన్ని ఎవరైనా ఆక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని ఇన్‌ఛార్జీ తహశీల్దార్ విజయ్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు విఆర్ఒతో విచారణ జరిపించగా ఆన్‌లైన్ అడంగల్, ఆర్ఒఆర్‌లో లండన్ మిషనరీ భూమిగా చూపుతోందన్నారు. అప్పట్లో లండన్ మిషనరీ ఇచ్చిన భవనం క్రైస్తవ సంఘానికి మాత్రమే హక్కులు ఉంటాయని, ఈ భవనాన్ని ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వచ్చారు.. వెళ్లారు..!

- లక్ష్యం ఘనం.. సేవలు దూరం...

- 104 సేవలు అంతంతమాత్రమే

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని గ్రామాలకు వెళ్లి ప్రజలకు సేవలందించాల్సిన 104 సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు. వారికి నచ్చిన చోట వాహనాన్ని ఆపి సేవలందిస్తున్నారు. గ్రామాలకు ఆలస్యంగా రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



గ్రామ సచివాలయం ముందు ఆగి ఉన్న 104 వాహనం

రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. అధికారం చేపట్టినప్పటి నుంచి అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఆ దిశలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేశారు. ఇప్పటికే ఆరోగ్యశ్రీ పథకంలో విప్లవాత్మక మార్పులు చేపట్టిన ప్రభుత్వం తాజాగా అత్యవసర వైద్య సేవలందించే 108, 104 సర్వీసుల్లో తనదైన ముద్ర వేసింది. అత్యవసర ప్రమాదాలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, వసతులతో 108, 104 వాహనాల్లో సమూల మార్పులు చేసి, వాటిని తీర్చిదిద్దింది. అందుకు విరుద్ధంగా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. మారుమూల ప్రాంతాల్లోనూ అత్యాధునిక వైద్య సేవలందించే విధంగా అన్ని వసతులతో రాష్ట్ర ప్రభుత్వం ఎంఎంయులను సిద్ధం చేసింది. ప్రతి మండలంలో ఒక సర్వీసు అందుబాటులో ఉండేలా ఒకేసారి 656 సర్వీసులను సిద్ధం చేసింది. ప్రతి మొబైల్ మెడికల్ యూనిట్‌లో ఒక డాక్టర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, డ్రైవర్, ఎఎన్ఎంతో పాటు ఆశా వర్కర్ ఉంటారు. 104 వాహనం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో అనుసంధానమై ఉంటుంది. ఒకే రోజు రెండు గ్రామాలకు వెళ్లాల్సినప్పుడు ఉదయం ఒక గ్రామానికి, సాయంత్రం మరో గ్రామానికి వాహనం వెళ్తుంది. ప్రతి వాహనం విలేజ్ క్లినిక్‌కు కూడా అనుసంధానమై ఉంటుంది. సచివాలయ పరిధిలో ప్రజల వద్దకే నెలకోసారి 104 వాహనం వైద్య సిబ్బంది, వైద్యాధికారి వెళ్లి గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించాల్సి ఉంది. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆ సచివాలయ పరిధిలోని ఆరోగ్య సమస్యలపై వచ్చిన ప్రజలకు వైద్యమందించి మందులు ఇవ్వాల్సి ఉంది. శుక్రవారం గ్రామ పంచాయతీ పరిధిలో వైద్య సేవలు అందించాల్సిన వైద్యాధికారులు సమయపాలన పాటించకపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. మధ్యాహ్నం వరకు వాహనం వద్ద వివిధ సమస్యలతో వచ్చిన వారికి వైద్య పరీక్షలు అందించి మందులు అందించాల్సి ఉంది. అందుకు విరుద్ధంగా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని గ్రామస్తులు విమర్శించారు. సచివాలయ పరిధిలోని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను సైతం పరిశీలించి అనారోగ్యం బారిన పడిన పిల్లలకు వైద్య పరీక్షలు అందించాల్సి ఉంది. ఆదోని మండలంలో 104 వాహన సిబ్బంది, వైద్యాధికారులు కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించడం లేదు. ప్రజల సౌకర్యార్థం చికిత్స అందించకుండా సిబ్బందికి సౌకర్యంగా 104 వాహనాల ను ఏర్పాటు చేసుకుంటూ, సమయపాలన పాటించకుం డా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జిల్లా స్థాయి అధికారులు స్పందించి గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉండే ప్రదేశాల్లో 104 వాహనాల ద్వారా వైద్య సదుపాయాలు కల్పించాలని గ్రామీణ ప్రాంతాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.

104 సేవలు

గతంలో 52 రకాల మందులు ఉండగా ఇప్పుడు సంఖ్యను 74కు పెంచారు. మధుమేహం, రక్తపోటు, గుండెజబ్బులు వంటి దీర్ఘకాలిక రోగాలకు సంబంధించి ప్రతి ఒక్కరినీ స్క్రీనింగ్ చేస్తారు. మాతాశిశు మరణాలను నివారించడం, చిన్నారుల ఆరోగ్యం కాపాడడం, వారిలో పౌష్టికాహార లోపం లేకుండా చూడడం, కొన్ని సీజన్లలో ప్రబలే అంటువ్యాధులు నివారించడం, గ్రామాల్లో నివసించే వారికి కూడా అత్యాధునిక వైద్య సదుపాయాలు కల్పిస్తూ మొత్తం 20 రకాల సేవలందించడం కోసం 104 సర్వీసుల్లో సమూల మార్పులు చేసింది రాష్ట్ర ప్రభుత్వం.

మేడే విజయోత్సవాలను ఘనంగా జరుపుకోవాలి

- యుఇఇయు గౌరవాధ్యక్షులు ఈరన్న

ప్రజాశక్తి - ఆదోని

137వ మేడే విజయోత్సవ సంబరాలను పట్టణం, నియోజకవర్గంలో ఘనంగా జరుపుకోవాలని యుఇఇయు గౌరవాధ్యక్షులు ఈరన్న, వైస్ ప్రెసిడెంట్ నాగరాజు కోరారు. శుక్రవారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆనాడు చికాగో ప్రదర్శనలో అశువులు బాసిన కార్మికుల గుర్తుగా జెండా ఆవిష్కరణలు కౌతాళం, ఆలూరు సబ్ డివిజన్లలో నిర్వహించుకోవాలన్నారు. జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు, డివిజన్, సబ్ డివిజన్‌ల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈరన్న

ఈనెల 30న సభను జయప్రదం చేయండి

- సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ఈ నెల 30న రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో జరిగే ప్రచార భేరి సభను జయప్రదం చేయాలని నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ, సిపిఎం మండల కార్యదర్శులు బసాపురం గోపాల్, లింగన్న, పట్టణ కార్యదర్శులు లక్ష్మన్న, సుదర్శన్ మాట్లాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు అందరమూ కలిసి ముందడుగు వేద్దామని కోరారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలను ఎండగట్టి ఇంటికి సాగనంపుదామని తెలిపారు. రాజ్యాంగ విలువలను కాపాడుకుందామని కోరారు. ఈనెల 30న జరిగే సభకు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, అజయ్ బాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, వెంకటేశులు హాజరవుతారని తెలిపారు. సిపిఎం నాయకులు గోపాల్, సిపిఐ నాయకులు అంజిత్ గౌడ్, రమేష్ పాల్గొన్నారు.

గుండెపోటుతో వైస్ ఎంపిపి మృతి

- నాయకుల ఘన నివాళి

ప్రజాశక్తి - పెద్దకడబూరు



మండల పరిధిలోని నౌలేకల్ గ్రామానికి చెందిన వైస్ ఎంపిపి పరమేష్ గౌడ్ శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సర్పంచి పల్లవి, నరేష్ కుమార్ గౌడ్‌లు పరమేష్ గౌడ్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. మంచి మిత్రుని కోల్పోయామని, పరమేష్ గౌడ్ లేని లోటు తీర్చలేదని కన్నీటి పర్యంతమయ్యారు. మృతి విషయం తెలుసుకున్న వైసిపి రాష్ట్ర యువ నాయకులు వై.ప్రదీప్ రెడ్డి పరమేష్ గౌడ్ మృతదేహానికి పూలమాల వేసి కుటుంబ సభ్యులను ఓదార్చారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టండి

- సిపిఎం జిల్లా నాయకులు వీరశేఖర్

ప్రజాశక్తి - దేవనకొండ

కార్పొరేట్ అనుకూల, ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బిజెపి విధానాలను ఎండగట్టాలని సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, మండల నాయకులు మహబూబ్ బాషా కోరారు. శుక్రవారం మండలంలోని కరివేముల, పాలకుర్తి, తెర్నేకల్ గ్రామంలో ప్రచార భేరి నిర్వహించారు. డివైఎఫ్ఐ నాయకులు కుంకనూరు శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బిజెపి విధానాల వల్ల దేశంలోని ప్రజలు, కార్మికులు, రైతులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సిపిఎం సీనియర్ నాయకులు బజారి, గాజుల శ్రీనివాసులు, కెపి.రాముడు, లక్ష్మిరెడ్డి, నాయకులు రాజశేఖర్ రెడ్డి, శాంతిరాజు, పేతురయ్య, రాముడు పాల్గొన్నారు. **పెద్దకడబూరు** మండలంలోని బసలదొడ్డి, పులి కణం, ముచ్చిగిరి, నౌలేకల్ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రచారభేరి నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న గౌడ్, సిపిఐ మండల కార్యదర్శి వీరేష్, రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు పరమేష్ మాట్లాడారు. ప్రజా వ్యతిరేక, మతోన్మాద విధానాలను అవలంభిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని కోరారు. వెంకటేష్, వీరన్న, రామిరెడ్డి, నాగప్ప, చిన్న వెంకటేష్, ఆనంద్, గోపాల్, బసవరాజు, నాగభూషణ్, ఈరన్న పాల్గొన్నారు. **హొళగుంద** మండలంలోని కోగిలతోట, ముద్దటమాగి, సమ్మతగేరి, మునుమానుగుంది, సులువాయి గ్రామాల్లో సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార భేరి నిర్వహించారు. సిపిఐ మండల సహాయ కార్యదర్శులు పెద్దహ్యాట మారెప్ప, రంగన్న, ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యులు శ్రీరంగ మాట్లాడారు. సిపిఐ మండల సహాయ కార్యదర్శి సలాం సాబ్, రైతు సంఘం నాయకులు మౌలా, సిపిఐ కార్యకర్తలు ఇనహీత్, వెంకన్న, నూర్ల బాష, మస్తాన్, అశోక్, యూసుఫ్ పాల్గొన్నారు.



తెర్నేకల్‌లో ప్రచార భేరి నిర్వహిస్తున్న నాయకులు



లోకేష్‌కు వినతిపత్రం ఇస్తున్న సాయిబాబు

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

- లోకేష్‌కు తెలుగు రైతు అధికార ప్రతినిధి సాయిబాబు వినతి

ప్రజాశక్తి - ఆదోని

పశ్చిమ ప్రాంత నియోజకవర్గాల్లో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జిల్లా తెలుగు రైతు అధికార ప్రతినిధి సాయిబాబు కోరారు. మంత్రాలయంలో జరుగుతున్న యువగళం పాదయాత్రలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు వర్షాధారం కింద ఆధారపడి జీవిస్తున్నారని, పంటలు పండక వలసలు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తుంగభద్ర డ్యామ్ నుంచి ఆంధ్రా వాటా కింద 734 క్యూసెక్కుల నీరు రావాల్సి ఉండగా 250 క్యూసెక్కులకు మించి ఉండడం లేదన్నారు. డ్యామ్ నుంచి పూర్తిగా నీరందేలా చూడాలని కోరారు. హగరి వద్ద సాగునీటి ప్రాజెక్టు నిర్మించి 60 టిఎంసిల ద్వారా జిల్లాలోని 6 లక్షల ఎకరాలకు నీరందించవచ్చని తెలిపారు. కౌతాళం మండలం మేళిగనూరు వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మించి రైతులను ఆదుకోవాలని కోరారు. అధికారంలోకి వస్తే సాగు, తాగునీరు అందేలా చూస్తారని లోకేష్ హామీ ఇచ్చారు.

ఇంటర్‌లో 'వైష్ణవి' జయభేరి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఇంటర్మీడియట్ ఫలితాల్లో పట్టణానికి చెందిన వైష్ణవి జూనియర్ కళాశాల విద్యార్థులు జయభేరి మోగించారు. శుక్రవారం కళాశాల ఛైర్మన్ జిడి.లింగప్ప, కరస్పాండెంట్ సత్య సిరి, కో కరస్పాండెంట్ జి.విష్ణు ప్రభులు ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపిసిలో ఇందుమతి 455, బైపిసిలో ఎస్.షామీర్ 408, ఎస్.తాబ్రేజ్ 401, సిఇసిలో హెచ్.శివ ప్రతిభ చాటారు. ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో ఎస్.గౌసియా బేగం 908, సి.స్రవంతి 831, బైపిసిలో పి.రఘువర్ధన్ 892, ఎన్.లలిత 882, సిఇసిలో సి.తులసి 852, జి.హిందూ 843 మార్కులు సాధించారు. ఒకేషనల్ గ్రూపులో మొదటి సంవత్సరం ఎంపిహెచ్‌డబ్ల్యు (ఫిమేల్) బి.సురేఖ 472, పి.రేష్మ 445, ద్వితీయ సంవత్సరంలో టి.నందిని 864, ఎస్.నస్రీన్ 854 మార్కులు సాధించారు. అలాగే మొదటి సంవత్సరం ఎంఎల్‌టిలో ఎం.ఈశ్వర్ 451, సి.ఇస్మాయిల్ 439, ద్వితీయ సంవత్సరంలో బి.ధరణి 789 మార్కులతో కళాశాల టాపర్లుగా నిలిచారు. డిగ్రీ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మధుబాబు, మునెప్ప పాల్గొన్నారు.





వేసవి అలవెన్స్ అమలు చేయాలి

- వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి బాలకృష్ణ

ప్రజాశక్తి - ఆస్పరి

ఉపాధి హామీ చట్టంలో పని చేస్తున్న కూలీలకు వేసవి అలవెన్స్ అమలు చేయాలని వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి బి.బాలకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆస్పరిలో ఉపాధి పనులను పరిశీలించి, కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధి హామీని పాత పద్ధతిలోనే కొనసాగించాలన్నారు. రోజువారీ వేతనం రూ.600 ఇవ్వాలని కోరారు. ప్రతి జాబ్ కార్డుకూ 200 రోజుల పని దినాలు కల్పించాలని తెలిపారు. పని ప్రదేశంలో టెంటు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేసి, మజ్జిగ ప్యాకెట్లు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని కోరారు. గ్రామం నుంచి పని ప్రదేశం 5 కిలో మీటర్ల దూరంలో ఉన్న కూలీలకు రవాణా చార్జీలు ఇవ్వాలన్నారు. పని చేసిన స్లిప్పులు, గడార, గడ్డపార, గంప చార్జీలు ఇవ్వాలని కోరారు. నేడు పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లో జరిగే ఉపాధి కూలీల సదస్సును జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. వ్యకాస మండల ఉపాధ్యక్షులు వెంకట రాముడు, రాము, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

మేడేను జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా నాయకులు ఈరన్న

ప్రజాశక్తి - కోసిగి రూరల్

కార్మిక దినోత్సవం మేడేను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు ఈరన్న కోరారు. శుక్రవారం సిఐటియు మండల ఉపాధ్యక్షులు వీరేశ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఈరన్న హాజరైన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్మికులు ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి లేబర్ కోడ్లు తీసుకొచ్చిందని చెప్పారు. స్కీం వర్కర్లకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించడం లేదని తెలిపారు. అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం తీసుకురావడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై అన్ని రంగాల కార్మికులు పోరాడాలని కోరారు. సిఐటియు మండల కార్యదర్శి రాముడు, అంగన్వాడీ యూనియన్ నాయకులు హెబ్సిబా రాణి, లూసమ్మ, విఆర్ఎల సంఘం నాయకులు రాజు, ఆటో యూనియన్ నాయకులు వెంకటేష్, నరసింహులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేయాలి

- కౌన్సిలర్ సైదాన్ బీ నిలదీత

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని ఫరిస్రా మొహల్లా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేయాలని ఆ వార్డు కౌన్సిలర్ సైదాన్‌బీ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఛైర్మన్ బోయ శాంత అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. కౌన్సిలర్లు ఎవరూ సమస్యలపై ప్రశ్నించకపోగా కేవలం వైసిపికి చెందిన ఫరిసా మొహల్లా కౌన్సిలర్ సైదాన్‌బీ, టిడిపి కౌన్సిలర్ పార్వతిలు ప్రశ్నించారు. ఫరిసా మోహల్లాలో తాగునీరు సమస్య తీవ్రంగా ఉందని, ప్రతిసారీ కౌన్సిల్‌లో విన్నవిస్తున్నామని, ఎందుకు పట్టించుకోవడం లేదని ఆమె ప్రశ్నించారు. ఇందుకు మున్సిపల్ ఎఇ మాట్లాడుతూ... వచ్చే కౌన్సిల్ సమావేశం నాటికి సమస్యను పరిష్కరిస్తామని హామీఇచ్చారు. 1వ వార్డులో డ్రెయినేజీలు నిర్మించాలని కౌన్సిలర్ పార్వతి కోరారు. ఇంటింటికి చెత్త సేకరణ చేస్తున్నా పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ చెత్త అలాగే ఉందని తెలిపారు. సంపూర్ణ పరిశుభ్రత ఎక్కడా అని, చెత్త సేకరణకు డబ్బులు ఎందుకు ఇవ్వాలని ప్రజలు తమను ప్రశ్నిస్తున్నారని కౌన్సిలర్ బాలాజీ అధికారులకు వివరించారు. చెత్త ఇవ్వడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఇంటింటి వద్దకు ఆటోలు వెళ్తున్నా చెత్త ఎందుకు ఇవ్వడం లేదని, కౌన్సిలర్లు కూడా సహకరించాలని కమిషనర్ రఘునాథ్ రెడ్డి కోరారు. కేవలం రెండు ప్రశ్నలతో కౌన్సిల్ సమావేశం ముగిసింది. కౌన్సిలర్లు ఎవరూ సమస్యలు లేవనెత్తడం లేదు. కౌన్సిలర్లు రఘునాథ్ రెడ్డి, సందీప్ రెడ్డి, మున్సిపల్ ఇంజినీర్ నాగభూషణం రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్ ఉన్నారు.



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ పార్వతి

పేదలకు అండగా రాంరెడ్డి సోదరులు

- రూ.10 వేలు ఆర్థిక సహాయం, విద్యకయ్యే ఖర్చు చేయూత

ప్రజాశక్తి మంత్రాలయం

నియోజకవర్గ ప్రజలకు అండగా, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి తోడుగా రాంపురం రెడ్డి సోదరుల సేవలు అందిస్తూ ముందుకు సాగుతున్నారు. ఒకరికి రూ.10 వేల ఆర్థిక సహాయం, మరొకరి చదువుకు అయ్యే ఖర్చు భరించే భరోసా ఇచ్చి మానవత్వం చాటుకున్నారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వైసిపి యువనేత వై.ప్రదీప్ రెడ్డి మండలంలోని చిలకలడోన గ్రామంలో శుక్రవారం రెండో రోజు 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరు గురించి లబ్ధిదారులతో అడిగి తెలుసుకున్నారు. అదే గ్రామానికి చెందిన మహానంది గత కొన్ని నెలల క్రితం గుంటూరు జిల్లా వినుకొండ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్దే ఉంటున్నారు. ఆరా తీసిన యువ నేత బాధితుని గోడు విని వెంటనే తక్షణ సహాయం కింద రూ.10 వేల నగదు అందజేసి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మరో చోట కర్రె లక్ష్మన్న అనారోగ్యంతో మృతి చెందగా ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారమూ రాకపోవడంతో విషయాన్ని ఆయన భార్య శంకరమ్మ ప్రదీప్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన వెంటనే కర్రె లక్ష్మన్న కుమారుడు హరికృష్ణ చదువుకు అయ్యే ఖర్చు భరిస్తామని హామీ ఇచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఉల్లిగడ్డల తిమ్మప్పను పరామర్శించారు. అవసరమైతే వైద్య ఖర్చులు చూసుకుంటామని ధైర్యం చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, ఎస్ఐ వేణు గోపాల్ రాజ్, సొసైటీ ఛైర్మన్ వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

వాటాల కోసం ఆగిన అభివృద్ధి

- ప్రారంభానికి నోచని దుకాణాలు - జనసేన ఇన్‌ఛార్జీ వెంకప్ప

ప్రజాశక్తి-ఆలూరు



రిలే దీక్షలో పాల్గొన్న తెర్నేకల్ వెంకప్ప

చిరు వ్యాపారులకు, నిరుద్యోగులకు చేదోడుగా ఉపాధి కల్పించాల్సిన అధికార పార్టీ నాయకులు, వాటాల కోసం ఆలూరు అభివృద్ధిని అడ్డుకుంటున్నారని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ తెర్నేకల్ వెంకప్ప విమర్శించారు. శుక్రవారం ఆలూరులోని సంతమార్కెట్, మండల పరిషత్ షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించాలని జనసేన పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ ఆవరణలో వాటర్ స్కీం ఎదురుగా మండల నాయకులు ఛత్రపతి రిలే నిరాహార దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకప్ప మాట్లాడారు. రెండేళ్ల క్రితమే రూఅర్బన్ నిధులు రూ.1.20 కోట్లతో సంతమార్కెట్‌లోని 27 దుకాణాలు, ఎంపిడిఒ కార్యాలయం ముందు రూ.80 లక్షలతో 18 దుకాణాలతో నిర్మించిన కాంప్లెక్స్‌ను వాటాల కోసం పాలకులు ప్రారంభించకుండా పంచాయతీకి, మండల అభివృద్ధికి నష్టం కలిగిస్తున్నారని తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించాల్సిన రాష్ట్ర మంత్రి గుమ్మనూరు జయరాం వాటాలు పక్కన పెట్టి అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. గతంలో అనేకసార్లు జనసేన పార్టీగా సంబంధిత అధికారులకు వినతిపత్రం అందించినా ప్రయోజనం లేకపోయిందని, నేడు రిలే నిరాహార దీక్ష చేపట్టినట్లు తెలిపారు. పాలకులు, అధికారులు స్పందించకుంటే జనసేన పార్టీ ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు, నిరుద్యోగులకు దుకాణాలను ఇస్తామని హెచ్చరించారు. హనుమంతు, హమీద్, పవన్, సిద్ధలింగా, వీరేష్, కృష్ణ, గంగాధర్, చంద్ర, నాగరాజు, ఉదయ్ పాల్గొన్నారు.

దమ్ముంటే బాలనాగిరెడ్డిపై పోటీ చేసి గెలవండి

- లోకేష్‌కు వైసిపి రాష్ట్ర యువ నేత ప్రదీప్ రెడ్డి సవాలు

ప్రజాశక్తి - మంత్రాలయం


దమ్ము, ధైర్యం ఉంటే వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిపై పోటి చేసి గెలిచి చూపించాలని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు వైసిపి రాష్ట్ర యువ నేత వై.ప్రదీప్ రెడ్డి సవాలు విసిరారు. లోకేష్ పర్యటనలో భాగంగా కోసిగి బహిరంగ సభలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని విషనాగని విమర్శించడంతో పైవిధంగా ఆయన స్పందించారు. శుక్రవారం మండలంలోని చిలకలడోన గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాము ఎప్పుడూ ప్రజల మనుషులమని, ప్రజల్లోనే ఉంటామని తెలిపారు. విష నాగా లేక ఆదుకునే మనిషో ఇక్కడి ప్రజలకు తెలుసని అన్నారు. 2024 ఎన్నికల్లో బాలనాగిరెడ్డిపై పోటీ చేసి లోకేష్ గెలిస్తే ఇక్కడ ఉన్న ఆస్తులను అమ్ముకుని వెళ్తామని సవాలు విసిరారు. మామను నమ్మించి వెన్నుపోటుతో చంపిన ఘనత చంద్రబాబుదని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులను తీసుకొచ్చిన ఘనత తమని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉంటామని, తమ కుటుంబంలో ముగ్గురు ఎమ్మెల్యేలు, ఒకరు ఎమ్మెల్సీగా ఉన్నారని తెలిపారు. లిక్కర్ తాగే అలవాటు తనకు లేదని, తాము లిక్కర్ మాఫియా సాగిస్తామా అని ప్రశ్నించారు. తమ ప్రాంతం వెనుకబడిన ప్రాంతమని, ధనికులతో చేసే రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పేదల పొట్టకొట్టాల్సిన అవసరం తమకు లేదని తెలిపారు. పెద్దకడబూరులో రామ్మోహన్ రెడ్డి భూ కబ్జా చేశారని చెప్పారు, లింక్ డాక్యుమెంట్లు చూపిస్తాం రండని చెప్పారు. కోసిగిలో ఎమ్మెల్యే భూకబ్జా చేయలేదని, నిరుపేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం భూమి తీసుకున్నారని తెలిపారు. తమ బాబాయిలు శివరామిరెడ్డి ఒకసారి ఎమ్మెల్యేగా, రెండుసార్లు ఎమ్మెల్సీగా, వెంకట్రామిరెడ్డి ప్రస్తుతం గుంతకల్లు ఎమ్మెల్యేగా, సాయిప్రసాద్ రెడ్డి మూడు పర్యాయాలు ఆదోని ఎమ్మెల్యేగా, బాలనాగిరెడ్డి వరుసగా హ్యాట్రిక్ విజయంతో మంత్రాలయం ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారని చెప్పారు. లోకేష్ బాబు ప్రత్యక్ష ఎన్నికల్లో గెలువకుండా, అడ్డదారిలో శాసనమండలి ద్వారా ఎన్నికై మంత్రి పదవి పొందారని, అలాంటి వారు నీతులు చెబుతున్నారని విమర్శించారు. పులికనుమ రిజర్వాయర్ నాటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో మంజూరు కాగా, కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వంలో పూర్తయిందని చెప్పారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో మాట్లాడి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి 5 లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు మంజూరు చేయించారని, హెడ్ వర్క్స్ పనులు కూడా కొనసాగేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. పులికనుమ ప్రాజెక్టు, చిన్నతుంబలం చెరువులో చేపల పెంపకానికి ప్రభుత్వ అనుమతితో ఆదోనికి చెందిన వ్యక్తి వ్యాపారం చేస్తున్నారని చెప్పారు. శ్రీరాఘవేంద్ర స్వామి మఠం అభివృద్ధి ప్రభుత్వ పరిధిలోకి రాదని, మఠం యాజమాన్యం, భక్తుల సహకారంతో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. శ్రీమఠం ముందు నూతనంగా నిర్మించిన కారిడార్‌కు లోకేష్, చంద్రబాబు వచ్చి రోడ్డు వెడల్పు చేసి పెయింటింగ్ చేసినట్లుగా చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో టెంకాయల వేలం దక్కించుకుంది టిడిపి కార్యకర్త కాదా అని తెలిపారు. తాము రాజకీయం చేయాలనుకుంటే వారికి టెండర్ దక్కేదా అని ప్రశ్నించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రదీప్‌రెడ్డి

విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



విద్యార్థులను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు

ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శుక్రవారం సన్మానించారు. మండలంలోని పెద్దహరివాణం గ్రామానికి చెందిన సద్దలగుడ్డ కాలింగ, కటికారు రాజేశ్వరి ఇంటర్ ఫలితాల్లో అత్యధికంగా మార్కులు సాధించడంతో శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, పాఠశాల ఛైర్మన్ బాలప్ప ఆధ్వర్యంలో గ్రామ అభ్యుదయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆదినారాయణ, కె.రాము సమక్షంలో సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ అభ్యుదయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆదినారాయణ, కె.రాము మాట్లాడారు. గ్రామంలోనే 1 నుంచి 5వ తరగతి వరకు విజేత ప్రైమరీ స్కూల్‌లో విద్యనభ్యసించి, స్థానిక జడ్‌పి హైస్కూల్‌లో పదో తరగతి ముగించుకొని కటికారు రాజేశ్వరి కర్ణాటకలోనూ, సద్దలగుడ్డ కాలింగ ఆంధ్రాలో ఇంటర్మీడియట్ ఫలితాల్లో అత్యధికంగా మార్కులు సాధించారని తెలిపారు. ఇలాంటి విద్యార్థులను తోటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని చదువులో సమయస్ఫూర్తి పాటిస్తూ ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. అలాగే ఈ విద్యార్థులు ఎంసెట్ కోచింగ్ తీసుకుంటే అవసరమైన పుస్తకాలను అందించేందుకు ముందుంటామని తెలిపారు. ఉపాధ్యాయులు శంకరప్ప, శివరాజ్ పాల్గొన్నారు.





సమాధుల వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం జిల్లా నాయకులు

కాయ్..రాజా కాయ్..

- జోరందుకున్న బెట్టింగ్ పర్వం
- ఆర్థికంగా నష్టపోతున్న యువత



ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఐపిఎల్ సీజన్ వచ్చిందంటే యువతలో జోరు అంతా.. ఇంతా కాదు. ఆ జోరును బెట్టింగ్ బుకీలు క్యాష్ చేసుకుంటున్నారు. మ్యాచ్‌లో సాగే బంతిబంతికీ పందేలు కాస్తున్నారు. ప్రస్తుతం ఐపిఎల్ ప్రారంభం రోజున కొన్ని ప్రాంతాల్లో మాత్రమే మొదలైన క్రికెట్ బెట్టింగ్ ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లోనూ ఊపందుకుంది...

తొలుత క్రికెట్ అంటే మానసికోల్లాసం కోసం, క్రీడా స్ఫూర్తి కోసమే ఆడేవారు. నేడు అది జూద క్రీడగానూ మారిపోయింది. గతంలో పట్టణాలకే పరిమితమైన 'బెట్టింగ్ ఫీవర్' నేడు మండల కేంద్రాలతో పాటు మారుమూల గ్రామాలకూ విస్తరించింది. వ్యవహారమంతా సెల్‌ఫోన్లలోనూ, ఆన్‌లైన్లలోనే సాగుతోంది. ప్రత్యేకంగా సెల్‌ఫోన్లు కొనుగోలు చేసుకుని తమ పేర్లతో లేని సిమ్ కార్డులను యువత బెట్టింగ్ కోసం వినియోగిస్తున్నారు. రూ.100 కాస్తే రూ.150, రూ.200 ఇస్తామంటూ బుకీలు ఆశ చూపి యువతను బెట్టింగ్ ఊబిలోకి లాగుతున్నారు. దాంతో యువత బెట్టింగ్‌లో బిజీబిజీ అయిపోయారు.

మ్యాచ్ మొదలవడానికి రెండు, మూడు గంటల ముందే వాట్సప్, మెసేజ్, ఫోన్ కాల్స్, ఇంటర్నెట్‌లో యువత బెట్టింగ్‌ను హోరెత్తిస్తున్నారు. చివరికి సర్వం కోల్పోయి వీధిన పడుతున్నారు. మ్యాచ్ ముగిశాక నగదు పంపిణీలో తేడాలు వస్తుండడంతో విద్యార్థుల్లోనూ, యువతలోనూ గొడవలు తలెత్తి పోలీసు స్టేషన్లలో పంచాయితీల వరకూ వెళ్తుండడం గమనార్హం. బెట్టింగ్ ద్వారా రాష్ట్రంలో రోజుకు రూ.కోట్లు చేతులు మారుతోంది. సాయంత్రమైతే చాలు గ్రామాల్లో ఇదే చర్చ జరుగుతోంది. 'ఈ రోజు ఏ జట్ల మధ్య మ్యాచ్ ఉంది. ఎవరెవరు ఆడుతున్నారు. ఏ జట్టుపై పందెం కాయాలి. ఎంత కాస్తే మనకెంత వస్తుంది' అంటూ యువత ఫోన్లలో సంభాషణలు సాగిస్తున్నారు. పాఠశాల విద్యార్థుల మొదలు వృద్ధుల వరకూ అందరూ ఈ బెట్టింగ్ వ్యవహారంలో పాలుపంచుకుంటున్నారు. మ్యాచ్ ఎవరు గెలుస్తారనే పందెంతో పాటు టాస్ ఎవరు గెలుస్తారన్నదీ నేడు పందెంగా మారిపోయింది.

ఈ బంతికి ఎంత స్కోర్ కొడతారనే పందెమూ నేడు అధికంగా సాగుతోంది. తెలియని అమాయక యువత అదృష్టం ఉంటే రూ.లక్షలు సంపాదించుకోవచ్చనే క్షణికావేశంతో బెట్టింగ్ వేసి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ప్రధాన ప్రాంతాల్లో ఉండే బెట్టింగ్ బుకీలు ఆయా ప్రాంతాల వారీగా మధ్యవర్తులను నియమించుకుని వారి ద్వారా బెట్టింగ్ తతంగాన్ని నడిపిస్తున్నారు. స్ట్రైట్, రైసింగ్, 30, 50, ఎస్, ఓకే, డన్ వంటి కోడ్‌లను ఉపయోగిస్తూనే ఈ బెట్టింగ్ అంతా సాగుతోంది. కర్నూలు, ఆదోని, నంద్యాల పట్టణాల్లో లాడ్జీలలో ఈ బెట్టింగ్ తంతు సాగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో స్కూళ్ల మైదానాల్లో సాయంత్రం పూట యువత చేరి బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు. క్షేత్రస్థాయిలో పోలీసులు బెట్టింగ్‌కు పాల్పడుతున్న యువతకు కౌన్సెలింగ్ ఇవ్వడం కూడా ఎక్కడా కనిపించడం లేదు. బెట్టింగ్ ద్వారా ఓ వైపు బుకీలు రూ.లక్షలు, రూ.కోట్లలో సంపాదిస్తుంటే యువత మాత్రం అప్పు చేసి మరీ బెట్టింగ్ కాస్తూ ఆర్థికంగా చితికిపోతున్నారు. ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయి.

సుదర్శన వర్మ ఆశయాలను కొనసాగిద్దాం : సిపిఎం

ప్రజాశక్తి - వెలుగోడు



సుదర్శన్ వర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

సుదర్శన వర్మ మద్దెల నాగిరెడ్డి ఆశయాలను కొనగిద్దామని సిపిఎం నాయకులు అన్నారు. సుదర్శన వర్మ మద్దెల నాగిరెడ్డిల వర్ధంతి సభ వెలుగోడు పట్టణంలోని సుదర్శన వర్మ నాగిరెడ్డిల సమాధిల వద్ద శుక్రవారం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి యేసు రత్నం అధ్యక్షతన జరిగిన ఈ సభకు ముఖ్యఅతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్, వెలుగోడు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జయపాల్, సిపిఎం సీనియర్ నాయకులు ఏ రాజశేఖర్, వై నాగేంద్రుడు, రామ లింగేశ్వర రెడ్డి హాజరై మాట్లాడారు. వెలుగోడులో దున్నేవాడికే భూమి కావాలని భూస్వాములను ఎదిరించి పేదలకు భూములు పంచిన చరిత్ర సుదర్శన వర్మ మద్దెల నాగిరెడ్డిది అన్నారు. వెలుగోడు గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా, జిల్లా పంచాయతీ కమిటీ మెంబర్‌గా సుదర్శన వర్మ పేదలకు, రైతులకు, కష్టజీవులకు సేవలు చేశారని అన్నారు. సుదర్శన వర్మ మద్దెల నాగిరెడ్డిల స్ఫూర్తితో మరింత పోరాటాలను ఉధృతం చేయాలని వారి ఆశయాలను కొనసాగించాలని వారు కోరారు. ఈ కార్యక్ర మంలో శంకర్ రెడ్డి, ప్రతాపరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, సిపిఎం మండల నాయకులు మహమ్మద్ రఫీ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె రామదాసు, సిఐటియు మండల నాయకులు శ్రీనివాసులు, రామాంజనేయులు, రైతు సంఘం జిల్లా నాయకులు రామేశ్వరరావు, యాదాటి రవి, ప్రజాశక్తి ఇన్చార్జి హనుమంతు, సిఐటియు మండల నాయకులు వెంకటయ్య, బాష, నూరుల్లా, హమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు, ఆటో కార్మికులు, వెలుగోడు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** సుదర్శన వర్మ జీవితం నేటి పోరాటాలకు ఆదర్శం కావాలని సిపిఎం సీనియర్ నాయకులు ఏ. రాజశేఖర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి. యేసు రత్నంలు అన్నారు. ఆత్మకూరు పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఆయన పెద్ద కుమారుడు విజయ్ కుమార్ వర్మతో కలిసి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సుదర్శన వర్మ గారి కోడలు విజయలక్ష్మి, మనుమడు రవి వర్మ, సిపిఎం పట్లణ కార్యదర్శి ఏ. రణధీర్, నాయకులు పి సుధాకర్, ఎన్ స్వాములు, ఏ సురేంద్ర,డి రామ్ నాయక్, భాస్కర్,అక్కిరాజు కిరణ్, శివుడు, విజయ్, రాముడుతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో వేగాన్ని పెంచాలి

- కలెక్టర్లకు సిఎం దిశానిర్దేశం
- 'జగనన్నకు చేబుదాం..'ను విజయవంతం చేయాలి





వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్పీ, జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రభుత్వ అధికారుల పనితీరు బాగుంటేనే.. ప్రభుత్వ పాలన కూడా సంతృప్త స్థాయిలో సాగుతుందని.. నాణ్యమైన సేవలను అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆయా జిల్లాల కలెక్టర్లు, జేసిలను ఆదేశించారు. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మే నెల 9న రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో ప్రారంభించనున్న "జగనన్నకు చెబు దాం..", స్పందన అర్జీలు, తదితర అంశాల్లో ఇప్పటి వరకు సాధించిన పురోగతి తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి సమీక్షించి దిశానిర్దేశం చేశారు. కలెక్టరేట్ లోని వీసీ హాలు నుండి జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సామూన్‌తో పాటు జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ నిశాంతి. టి. తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం విసి హాలులో హాజరయిన జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సంతృప్తి చెందే స్థాయిలో స్పందన సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. పోలీస్, పంచాయతీరాజ్, రెవెన్యూ, మున్సిపాల్టీలు, సివిల్ సప్లై, వ్యవసాయం, డిఆర్డిఏ, హౌసింగ్ తదితర శాఖల్లో స్పందన దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఎ లోకి వెళుతున్నాయని సంబంధిత అధికారులు ప్రత్యేక దష్టి ఏరోజుకారోజు క్లియర్ చేయాలన్నారు. ప్రతి దరఖాస్తును వితిన్ ఎస్ఎల్ఎలో నే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. స్పందన దరఖాస్తులు పరిష్కరించడంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శించకుండా ప్రజలు సంతృప్తి చెందే స్థాయిలో సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. స్పందన ఫిర్యాదులలో రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీరాజ్ సంబంధించిన దరఖాస్తులు ఎక్కువగా వస్తుంటాయని ప్రతిరోజు స్పందన పరిష్కారం పై అర్థగంట సమయం కేటాయించి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. స్పందన ఫిర్యాదులను నాణ్యతతో పరిష్కరించడంతోపాటు సంబంధిత దరఖాస్తుకు అవసరమైన డాక్యు మెంట్లు జతచేయాలని కలెక్టర్ సూచించారు. స్పందన గ్రీవెన్స్‌ను మరింత నాణ్యమైన, పారదర్శకమైన పరిష్కారం అందించేందుకు జిల్లా, మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి స్పందన ధరఖాస్తులు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాడు-నేడు కింద పాఠశాలల్లో చేపట్టిన మరమ్మత్తు పనులు వచ్చే నెల 10వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. ఇంఛార్జి డిఆర్ఓ కామేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

వైసిపితోనే అభివృద్ధి

- మున్సిపల్ చైర్మన్ మాబున్నీ సా, కౌన్సిలర్ తబ్రేజ్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వైసీపీ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, అభివృద్ధికి మరో పేరుగా ఎమ్మెల్యే రవిచంద్ర కిషోర్ రెడ్డి నిలిచారాని మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నీ సా పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణం నాలుగో వార్డ్ పరిధిలోని కాళికాంబ గుడి దగ్గర 20 లక్షల రూపాయలతో సిసి రోడ్డు, కల్వర్టు, కాలువల నిర్మాణాలకు మునిసిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా, కౌన్సిలర్ తబ్రేస్ సయ్యద్‌లు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ షేక్.మాబున్నీ సా మాట్లాడుతూ నాలుగో వార్డు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ అభివృద్ధి పనులు చేస్తున్నారని కౌన్సిలర్ తబ్రేజ్‌ను అభినందిచారు. వార్డు అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కౌన్సిలర్ తబ్రేజ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే శిల్పా రవి సహకారంతో వార్డును మరింత అభివృద్ధి చేస్తామని ఆయన పేర్కొన్నారు. డిఇఇ మధు కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


భూమి పూజ చేసిన మున్సిపల్ చైర్మన్ మాబున్నీ సా, కౌన్సిలర్ తబ్రేజ్



ట్రాన్స్మిటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ పోచా, తదితరులు

ఆళ్లగడ్డలో ఆకాశవాణి ఎఫ్ఎం ట్రాన్స్ మీటర్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద నూతనంగా నిర్మించిన ఆకాశవాణి ఎఫ్ఎం ట్రాన్స్ మీటర్ ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. దేశవ్యాప్తంగా వర్చువల్ విధానంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పలు ఎఫ్ఎం రేడియో స్టేషన్లను ప్రారంభించడం జరిగింది. ఆళ్లగడ్డలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నంద్యాల ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి, డీఎస్పీ సుధాకర్ రెడ్డి, ఎంపీడీవో సుబ్బారెడ్డి, కమిషనర్ రమేష్ బాబు, ఆకాశవానికి సంబంధించిన అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ పోచా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 91 ఎఫ్ఎం స్టేషన్లు ఉండగా రాష్ట్రంలో ఒక ఆళ్లగడ్డలోనే రేడియో స్టేషన్ ప్రారంభించడం గర్వ కారణమన్నారు. సమాజం ఒక మంచి మార్గంలో నడిచేందుకు రేడియో దోహదపడుతుందన్నారు. వ్యవసాయం గురించి, వర్షాల గురించి, దేశ విదేశాల్లో జరుగుతున్న పరిణామాల గురించి పూర్తిస్థాయి సమాచారం ఆకాశవాణి ద్వారా లభ్యమవుతుందన్నారు. టెలివిజన్ ద్వారా వచ్చే సమాచారం సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎఫ్ఎం రేడియో ద్వారానే ప్రధాని మోడీ మన్కీ బాత్ కార్యక్రమంతో ప్రజలతో నేరుగా మాట్లాడడం జరుగుతోందన్నారు.. ఆకాశవాణి డిప్యూటీ డైరెక్టర్ సోమేశ్వరరావు, ఆకాశవాణి కర్నూలు ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ దేవరభట్ల మురళి, ఆకాశవాణి డిప్యూటీ డైరెక్టర్ వీరభద్రుడు, అడిషనల్ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి లు మాట్లాడారు. అనంతరం పాల్గొన్న అతిథులను ఆకాశవాణి అధికారులు సన్మానించారు.కార్యక్రమంలో సీఐ జీవన్ గంగనాద్ బాబు, వార్డ్ కౌన్సిలర్ గురుమూర్తి, వైకాపా నాయకులు ఓబులంపల్లి రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో 20 మందికి జైలు

- జిల్లా ఎస్పీ కె . రఘువీర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 20 మందికి నంద్యాల జుడీష్యల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జైలు శిక్ష విధించిందని ఎస్పీ కె. రఘు వీర్ రెడ్డి తెలిపారు. రెండు రోజులుగా నంద్యాల డీఎస్పీ సి. మహేశ్వర రెడ్డి, నంద్యాల సబ్ డివిజన్ పోలీసు అధికారుల ఆధ్వర్యంలో నంద్యాల సబ్ డివిజన్ నందు ముమ్మర తనిఖీలు చేశారు. 20 మంది మద్యం తాగి వాహనము నడుపు తుండగా పట్టుబడిన వారిని శుక్రవారం నంద్యాల జుడీష్యల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ముంది హాజరు పరచగా సదరు జడ్జ్ ఆర్. రామభూపాల్ రెడ్డి సదరు మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన 20 మందికి ఒక్క రోజు జైలు శిక్ష విడిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్పీ కె. రఘు వీర్ రెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లాలో ఎవరైనా మద్యం త్రాగి వాహనం నడిపిన, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన, ద్విచక్ర వాహనం పై ముగ్గురు వ్యక్తులు ప్రయాణించిన, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంగించిన వారి పై నంద్యాల జిల్లా పోలీసు లు కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మైనర్ లు వాహనం నడిపి వారు ఏదైనా ప్రమాదం కు గురి చేస్తే తల్లిదండ్రులపై చర్యలు తీసుకొనబడుతుందని జిల్లా పోలీస్ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

22 అంశాలను ఆమోదించిన డోన్ కౌన్సిల్

- పట్టణ సుందరీకరణకు చర్యలు : ఛైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి-డోన్

డోన్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో 22 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించిందని, పట్టణ సుందరీకరణకు తగు చర్యలు తీసుకుంటున్నామని ఛైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. శుక్రవారం డోన్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 22 అంశాలకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. పట్టణంలోని కొండపేట బిసి హాస్టల్ ఎదురుగా బాలికల మదర్సా కోసం మూడు సెంట్ల స్థలం కేటాయించింది. కొండమీద ఐలవ్‌డోన్, నేషనల్‌ఫ్లాగ్ కోసం ఐదు సెంట్ల స్థలం కేటాయించామని ఫారెస్ట్ అధికారులకు తీర్మానం చేసి పంపించామన్నారు. డోన్ పట్టణ సుందరీకరణకు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఫ్లైఓవర్‌తోపాటు ముఖ్యమైన ప్రదేశాలలో రంగులు వేయిస్తామన్నారు. ఫ్లై ఓవర్ కింద దుకాణాలు ఒక క్రమపద్ధతిలో లేవని షాపులను ఒక క్రమపద్ధతిలో ఒకే సైజులో నిర్మించి అద్దెకు ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్లు కొట్రికె హరికిషన్, ఎస్ఎండి జాకీర్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎఇ జనార్ధన్, సానిటరీ ఇన్‌స్పెక్టర్, విద్యుత్ శాఖ వారు, హౌసింగ్ వారు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఛైర్మన్ సప్తశైల రాజేష్

అభివృద్ధి పనులపై సెల్ఫీ ఛాలెంజ్

ప్రజాశక్తి - బండి ఆత్మకూరు

గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులపై టిడిపి మాజీ ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, భూమా బ్రహ్మానందరెడ్డిలు రాష్ట్ర ప్రభుత్వానికి సెల్ఫీ ఛాలెంజ్‌లు విసిరారు.

నాటి టిడిపి ప్రభుత్వ హయాంలో బండి ఆత్మకూరు నుండి ఓంకారం వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి శుక్రవారం సెల్ఫీ తీసి ఆయన చాలెంజ్ విసిరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్ రోడ్డు పనుల కోసం గత ప్రభుత్వంలో నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించడం జరిగిందని అన్నారు. రాష్ట్రంలో వైసిపి అధికారం చేపట్టిన తర్వాత గత ప్రభుత్వంలో మంజూరైన పనులపై జగన్ సర్కార్ పూర్తి నిర్లక్ష్యం వహిస్తుందని ఆయన మండిపడ్డారు. నాలుగేళ్లు గడిచిన ఓంకారం డబుల్ రోడ్డు పనులు పూర్తి చేయలేదని ఆయన దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి పనులు,ప్రస్తుత ప్రభుత్వంలో నిలిచిపోయిన ప్రాంతాల్లో సెల్ఫీ తీసి చాలెంజ్‌లు విసురుతు ప్రభుత్వ తీరును ఎండగట్టడం జరుగుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి కుంటుపడిందన్నారు.


ఓంకారం రోడ్డు గుంతలు చూపుతున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

యువగళం పాదయాత్ర పై సమీక్ష

శ్రీశైలం నియోజకవర్గంలో యువగళం పాదయాత్ర చేపట్టే అంశంపై మాజీ ఎమ్మెల్యే మండల నాయకులతో సమీక్షించారు. ముఖ్యంగా లోకేష్ పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన అంశాలు,ఆయన బస చేసే ప్రాంతాల కోసం స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కంచర్ల సురేష్ రెడ్డి, బొల్లవరం మల్లేశ్వర్ రెడ్డి,బైరెడ్డి నుబ్బారెడ్డి,కృష్ణారెడ్డి,బుగ్గ రాముడు,సిద్దయ్య,జాకీర్ ఖాన్ తదితరులు ఉన్నారు.

నంద్యాల కలెక్టరేట్: సెల్ఫీ ఛాలెంజ్‌ల పర్వం నంద్యాల జిల్లాలో కొనసాగుతుంది. ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి గత వారం రోజుల కిందట నారా లోకేష్ నంద్యాల మెడికల్ కళాశాల వద్దకు వచ్చి సెల్ఫీ ఛాలెంజ్ చేయాలని సవాల్ విసరగా అందుకు స్పందించిన మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి తెలుగుదేశం ప్రభుత్వం హయంలో జరిగిన అభివద్ధి పనుల వద్ద శిల్పా రవి సెల్ఫీ చాలెంజ్ చేయాలని సవాల్ విసిరారు. ఈ క్రమంలోనే భూమా బ్రహ్మానందరెడ్డి తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు, తన బాబాయ్ భూమా నాగిరెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి పనుల దగ్గర సెల్ఫీ ఛాలెంజ్లను విసిరారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి గత తెలుగుదేశం పార్టీ (టీడీపి) ప్రభుత్వంలో నంద్యాల బలిజల చిరకాల కోరిక బలిజ కళ్యాణమండపంను తెలుగుదేశం పార్టీ హయాంలో అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న భూమా బ్రహ్మానంద రెడ్డి సాంక్షన్ చేపించి , బలిజ కళ్యాణమండపంకు 3 కోట్లు రూపాయలు విడుదల చేయగా ఈ వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం వచ్చి 4 సంవత్సరాలు అవుతున్న మండపం పనులు పూర్తి చేయడానికి సహకరించక పోవడంతో బలిజ కళ్యాణమండపం ప్రారంభం చేసుకొలేని పరిస్థితులుల్లో ఉన్నారని అన్నారు. కుందునది బ్రిడ్జి 80% పనులు పూర్తి చేస్తే వైసిపి ప్రభుత్వం 20 శాతం పనులు పూర్తి చేసి ప్రారంభం చేసుకొలేని పరిస్థితులుల్లో ఉందని అన్నారు.

మాజీ ఎమ్మెల్యేలు భూమా బ్రహ్మానందరెడ్డి, బుడ్డా సవాల్


సెల్ఫీ చాలెంజ్ విసురుతున్న మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి


పార్టీ నాయకులతో కలిసి ఓంకారం డబల్ రోడ్డును పరిశీలిస్తున్న దృశ్యం



మేడేను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - ఆత్మకూరు

మేడేను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కోరారు. శుక్రవారం నందికొట్కూరులో సిఐటియు కార్యాలయంలో ఆర్ జయరాన్ని అధ్యక్షతన టౌన్ రూరల్ మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు కే భాస్కర్ రెడ్డి, టౌన్ కార్యదర్శి టి గోపాలకృష్ణ మాట్లాడారు. మే ఒకటి నుండి ఏడో తేదీ వరకు జరిగే వారోత్సవాలను తాలూక వ్యాప్తంగా విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సెక్టార్ నాయకురాలు శైలజ, ఆశా వర్కర్ పిహెచ్సి నాయకురాలు నజీర్నిస, మంజుల, టాటా మ్యాజిక్ ఆటో నాయకులు మునిస్వామి, మండల అధ్యక్ష, కార్యదర్శులు నాగన్న, ఆంజనేయులు, హమాలీ, ఆటో, మధ్యాహ్నం భోజనం మున్సిపల్ స్కావెంజర్ నాయకురాలు రత్నమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్ వల్ల రూ.5 లక్షల నష్టం

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండల పరిధిలోని నాయన పల్లె గ్రామంలో నివాసం ఉంటున్న నడిపి గంగ మ్మ ఇంటిలో ప్రమాదవశాత్తు విద్యుత్ శాఖ ప్రమాదం జరిగి ఇంట్లో వస్తువులు పూర్తిగా దగ్ధం అయ్యాయి. ఈ ప్రమాదంలో మొత్తం ఐదు లక్షల రూపాయలు నష్టం జరిగినట్లు బాధ్యతలు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, తాసిల్దార్ ధోని ఆల్ ఫ్రెండ్ దగ్ధమైన ఇంటిని పరిశీలించి, పరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.


విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కి గురైన ఇంటిని పరిశీలిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, తాసిల్దారు ధోని ఆల్ ఫ్రెండ్

పట్టాలిచ్చిన భూమిని చూపాలి : వ్యకాసం

ప్రజాశక్తి - ఆత్మకూరు

దళితులకు, పేదలకు పట్టా పాస్ పుస్తకాలు ఇచ్చి ఇంతవరకు భూములు చూపకపోవడం విచారకరమని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి శివ నాగరాణి అన్నారు. శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మిడ్తూర్ తాసిల్దార్ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలను నాలుగో రోజు ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం వల్ల పేదలు బలైపోతున్నారని అన్నారు. మిడుతూరు మండల కేంద్రంలోని దళితులు, బీసీలకు 46 కుటుంబాలకు 1996లో పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వగా, బ్యాంకులో పంట రుణాలు ఇచ్చి, ప్రభుత్వం ఎరువులు విత్తనాలు ఇచ్చారు కానీ భూములు చూపకుండా అధికారులు కాలయాపన చేయడం విచారకరమని వారు ఆరోపించారు. పట్టాలిచ్చిన పేదలకు భూములు చూపేవరకు వ్యవసాయ కార్మిక సంఘం అండగా ఉంటుందని వారు తెలిపారు. పట్టాలిచ్చిన దళితులకు భూములు చూపించమంటే తాసిల్దార్ రికార్డు లేవని సమాధానం చెప్పడం పేదల పాలిట నిర్లక్ష్యంగా వహించడమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం నాగేశ్వరావు, ఎం సుధాకర్, జిల్లా నాయకులు ఆర్ ఈశ్వరయ్య, బాలయ్య, ఫకీరు సాహెబ్ ,నరసింహ నాయక్, ఈశ్వరమ్మ, డేవిడ్, ఓబ్లేస్ ఎం.కరణ, శ్రీనివాసులు, స్థానికులు విజ్ఞానం తిరుపతయ్య, జయరాముడు, ఏసన్న, వెంకటమ్మ, లింగమ్మ, నాగమ్మ,ప్రకాషమ్మ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్నరాష్ట్ర ఉపాధ్యక్షురాలు నాగమణి

10 వరకు అక్రిడేషన్‌కు దరఖాస్తులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, ఫ్రీలాన్స్, వెటరన్, న్యూస్ ఏజెన్సీ జర్నలిస్టులు నూతన అక్రిడేషన్ కొరకు ఆన్లైన్ ద్వారా మే 10వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ మనజీర్ జిలానీ సామూన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు సంవత్సరాల వ్యవధితో 2023-24కు అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి నేటి నుండి ఆన్లైన్ దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జర్నలిస్టులు సమాచారశాఖ ఆన్లైన్ వెబ్ సైట్ www. ipr.ap. gov.in నందు వారికి సంబంధించిన వివరాలను అప్లోడ్ చేయాలని, ఆ తదుపరి ప్రింట్ డాక్యుమెంట్ కాపీలను, జత పరచిన పత్రములతో సహా దరఖాస్తు ఒక ప్రతిని నంద్యాలలోని సమాచార పౌర సంబంధాల శాఖ డివిజనల్ కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఆన్లైన్‌లో జత పరచవలసిన డాక్యుమెంట్లను పీడీఎఫ్ ఫార్మాట్, ఫోటో, సిగ్నేచర్‌ను జేపీజీ ఫార్మాట్లో అప్లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. పాత్రికేయులు, మీడియా సంస్థలు జత చేయవలసిన డాక్యుమెంట్ల వివరాలన్నీ ఆన్లైన్లో పొందు పరచడం జరిగిందన్నారు.

వాచ్‌మెన్ పోస్ట్ భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఒప్పంద ప్రతిపదికపై వాచ్ మెన్ పోస్ట్ భర్తీ కొరకు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ టి. రాయపురెడ్డి శుక్రవారం తెలిపారు. 8వ తరగతి విద్యార్హత కలిగి ఉండాలని, వయస్సు 24-4-2023నాటికి 47సంవత్సరాలకు లోపు కలిగి ఉండాలని అన్నారు. బి సి (ఏ)(డబ్ల్యు)వర్గానికి చెందిన వారై ఉండాలని తెలిపారు.కళాశాల పనివేళల్లో నంద్యాల ప్రభుత్వ ఐటిఐ నందు రూ.20 చెల్లించి దరఖాస్తు పొందవచ్చని అన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులు మే నెల 12వ తేదీ సాయంత్రం 5గంటల లోపు అందచేయాలని అన్నారు. మే నెల 15వ తేదీ డోన్ ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఇంటర్వ్యూ ఉంటుందని ఆసక్తి కలిగి అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

30 నుండి ఆరాధన ఉత్సవాలు

ప్రజాశక్తి - రుద్రవరం

ఈనెల 30వ తేదీన నిర్వహించే వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకులు ఏడుల బ్రహ్మానంద రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ స్థానిక భాస్కర సందీశ్వర ఆలయంలో నిర్మించిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో 11వ ఆరాధన ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక అభిషేకం పూజ కార్యక్రమాలు నిర్వహిస్తామ న్నారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు అన్నదానము ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. కావున ప్రజలు ఈ ఆరాధన ఉత్సవాల్లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వాలీబాల్ శిక్షణ సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - ఆత్మకూర్

మే 1వ తేదీ నుంచి ఆత్మకూర్ పట్టణంలోని స్టేడియం ప్రాంగణంలో వేసవిలో వాలీబాల్ శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నామని ఆత్మకూర్ స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్సిల్ మున్నా తెలిపారు.ఈ శిక్షణ శిబిరాలు 30 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆత్మకూర్ సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు, సౌత్ సెంట్రల్ రైల్వే కోచ్ నిమ్మి కృష్ణ యాదవ్ హాజరవుతున్నట్లు తెలిపారు. ఆత్మకూర్ మండల క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఆత్మకూర్ స్పోర్ట్స్ క్లబ్‌కి అవకాశం కల్పించిన నంద్యాల జిల్లా వాలీబాల్ చీఫ్ కోచ్ రాజుకి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఆత్మకూర్ స్పోర్ట్స్ క్లబ్ గౌరవా ధ్యక్షులు రేడియం నూర్, సహాయ కార్యదర్శి ఆసిఫ్ బేగ్ పాల్గొన్నారు.

20 కుటుంబాలు టిడిపిని వీడి వైసిపిలోకి


ఎమ్మెల్యే సమక్షంలో వైసిపిలో చేరుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాసంలో కొలిమి గుండ్ల మండలం కమ్మవారిపల్లె గ్రామపంచాయతీ పరిధిలోని లక్షుంపల్లె గ్రామంలో 20 కుటుంబాలు టిడిపిని వీడి వైసిపిలో చేరాయి. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాసంలో కొలిమిగుండ్ల మండలం లక్షుం పల్లె గ్రామానికి చెందిన టిడిపి నాయకులు గంగమ్మ గారి శ్రీను, గమ్మగారి కిట్టు , గంగమ్మ గారి రవి, గంగమ్మ గారి పవన్, గంగమ్మ గారి సుదర్శన్, గంగమ్మ గారి సుధాకర్, గంగమ్మ గారి వంశీధర్, బాలసుబ్బన్న గారి చిన్న కొండయ్య, పూజారి ప్రసాద్, పూజారి శ్రీను, ఎద్దుల పెద్ద కొండయ్య, దాసిగారి శ్రీనివాసులు, బుజ్జన్న గారి సురేష్, పొన్నం పల్లె వెంకటేశు, శీనన్న గారి వెంకటేశులు, బాలసుబ్రమణ్యం గారి వినయ్, గంగమ్మ గారి వెంకటేశు , పూజారి గంగాధర్, వెంకటపతి గారి మధుసూదన్, తలారి వెంకట నాయుడు, నర్సారెడ్డి గారి కిట్టులో టిడిపిని వీడి వైసీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వైసిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ కమ్మవారిపల్లె గ్రామపంచాయతీ పరిధిలోని, లక్షుం పల్లె గ్రామానికి చెందిన ఐదు కుటుంబాలు మాత్రమే వైసిపి పార్టీని వీడి టిడిపి పార్టీలో చేరడం జరిగిందని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో భూ పంపిణీలో లబ్ధి పొందిన నాయకులు నేడు వైసిపిని విడి టిడిపి పార్టీలో చేరడం వారి విజ్ఞతకే వదిలి వేస్తున్నానని చెప్పారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక పనులు చేయించుకున్న వారు నేడు కేవలం ఐదు కుటుంబాలు మాత్రమే టిడిపి పార్టీలో చేరితే వారికి వ్యతిరేకంగా 20 కుటుంబాలు నేడు టిడిపి పార్టీని వీడి వైసిపిలో చేరడం జరిగిందని చెప్పారు. వైసిపిలో చేరిన వారికి తన సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని ,వారికి ఏ అవసరం వచ్చినా కూడా తాను అండగా ఉంటానని చెప్పారు. అధికారం చేపట్టిన తర్వాత పార్టీలకు కులాలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అర్హులైన ప్రతి పేదవానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొలిమిగుండ్ల మండల వైసిపి కన్వీనర్ అంబటి గురివి రెడ్డి, కమ్మవారిపల్లి గ్రామ సర్పంచ్ కొండయ్య, వైసిపి నాయకులు అల్లు నాగేశ్వరరావు, ములకల రామ్మోహన్, పోతూరి రంగయ్య, తమ్మినేని బాలయ్య, గంగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, గంగిరెడ్డి రామేశ్వర్ రెడ్డి , నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆత్మకూర్

గడపగడపకు మన ప్రభుత్వంలో కార్యక్రమంలో భాగంగా వార్డులలో సంచరించినప్పుడు తమ దృష్టికి వచ్చే వార్డు సమస్యలను ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని శ్రీశైల నియోజవర్గ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు ఆత్మకూరు పట్టణంలోని 20వ వార్డులో ఆత్మకూరు మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ ఆసియా వైస్ చైర్మన్ రాజగోపాల్, వార్డు కౌన్సిలర్ రంగస్వామితో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఈ వార్డులో పలువురు ప్రజలు తమ వార్డులో ఉన్న సమస్యలను స్థానిక సమస్యను సిసి రోడ్లు డ్రైనేజీ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని రావడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంటిలోని సభ్యులకు సంక్షేమ పథకాలు అందించాలన్న దృఢ సంకల్పంతో పని చేస్తున్నదని నేడు అత్యధిక శాతం ప్రతి ఇంటికి రాష్ట్ర ప్రభుత్వ అందిస్తున్న ఏదో ఒక పథకం లబ్ధిదారులకు ఆ ఇంటిలో వారికి


గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా

చేరుతున్నాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ మున్సిపాలిటీ అధికారులు తాసిల్దార్ ప్రకాష్ రావు, ఎంఈఓ జానకిరామ్, విద్యుత్ శాఖ ఏఈ రమేష్ బాబు, వ్యవసాయ శాఖ ఏవో విష్ణువర్ధన్ రెడ్డి, మెప్మా, ఐసిడిఎస్ అధికారులు, వైఎస్ఆర్సిపి పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మీ ర్, మండల పార్టీ అధ్యక్షుడు రాజమోహన్ రెడ్డి, కౌన్సిలర్లు మారుపోతుల విజయ్, పాణ్యం పార్వతి, పువ్వాడి భాస్కర్, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

మండలంలోని కరివేన గ్రామంలో నూతన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి శుక్రవారం భూమి పూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్ సబ్ స్టేషన్ పూర్తి కావడంతో ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని జగనన్న కాలనీకి, కరివేన గ్రామపంచాయతీకి ప్రత్యేకంగా విద్యుత్ సరఫరా అయ్యేందుకు వీలవుతుందని ఆయన అన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాజమోహన్ రెడ్డి గారు,టౌన్ ప్రెసిడెంట్ ఎన్ఎస్ సయ్యద్ మీర్ గారు, జడ్పిటిసి సభ్యులు శివశంకర్ రెడ్డి, ఎంపీపీ తిరుపాలమ్మ, అంజాద్ అలీ, పువ్వాడి భాస్కర్, గ్రామ సర్పంచ్ మాణిక్యం, సింగల్ విండో చైర్మన్ సురేష్, దినకర్ నాగిరెడ్డి, మహేష్, రవి నాయక్, మున్సిపల్ కౌన్సిలర్లు, టౌన్, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి బదిలీ తప్పనిసరి : ఎమ్మెల్యే కాటసాని

ప్రజాశక్తి - బనగానపల్లె

ప్రతి ఉద్యోగికి బదిలీ తప్పనిసరి అని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు .శుక్రవారం రాత్రి పట్టణంలోని జిఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో బదిలీపై వెళ్లిన సిఐ సుబ్బారాయుడును ఘనంగా సన్మానించారు. పట్టణంలోని జిఎంఆర్ ఫంక్షన్ హాల్లో బనగానపల్లె సిఐగా పని చేస్తూ అనంతపురం రేంజ్‌కు బదిలీపై వెళ్లిన సీఐ సుబ్బరాయుడుని, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి డోన్ డిఎస్పి శ్రీనివాస రెడ్డిల ఆధ్వర్యంలో సర్కిల్ కార్యాలయం పరిధిలోని ఎస్సైలు, పోలీసులు సిబ్బంది, పట్టణ ప్రముఖులు, వైసీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ సిఐ సుబ్బారాయుడు సర్కిల్ పరిధిలో చేసిన సేవలను కొనియాడారు. సీఐ సుబ్బరాయుడు పనిచేసిన నిరోదులు సర్కిల్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి విషయాన్ని శ్రద్ధతో



సీఐని సన్మానంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

పరిష్కరించినట్లు తెలిపారు. ఇక్కడ పని చేసినన్ని రోజులు అధికారులతో ప్రజలతో మంచి సంబంధాలను కొనసాగించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ నాయకులు కాటసాని ప్రసాద్ రెడ్డి, వైసీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరు పాల్ రెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గుండం శేషి రెడ్డి, ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ ఖైర్ , సీనియర్ న్యాయవాది మాధవరెడ్డి లాయర్ జగన్నాథరెడ్డి లాయర్ బాబు, వైసిపి ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, కొత్తపేట తమ్మడపల్లె సర్పంచ్‌లు రమణ, వెంకటరామిరెడ్డి బనగానపల్లె, అవుకు, నందివర్గం, ప్యాపిలి ఎస్సైలు నవీన్ బాబు, వీరాంజనేయులు, జగదీశ్వర్ రెడ్డి, రామాంజనేయరెడ్డి, సీఎం రాకేష్, పట్టణ ప్రముఖులు సీఎం టాకీస్ మహబూబ్ పీరా నూకల విజయ్ కుమార్, నల్లగట్ల వెంకటేశ్వర్లు, వైసీపీ నాయకులు పసువుల జనార్దన్ రెడ్డి, చిన్న రాజుపాలెం పాపన్న, ఎర్రగుడి రామసుబ్బారెడ్డి, చెర్లో కొత్తూరు మాధవరెడ్డి, రామకృష్ణాపురం నాగేంద్ర, పోలీసులు , సిబ్బంది పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు

ఉరుసు వేడుకల్లో ఎమ్మెల్యే శిల్పా

ప్రజాశక్తి - మహానంది



మండలంలోని నందిపల్లి గ్రామంలోని హాజరత్ మదర్ వలి ఉరుసు మహోత్సవ వేడుకల్లో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. శుక్రవారం నాడు ఉరుసు మహెూత్సవంలో పాల్గొని హజరత్ మదర్ వలి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించుకున్నారు. అనంతరం ఉమ్మడి జిల్లాల నుంచి తరలివచ్చి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏలాంటి అవాంఛనీయ సంఘట నలు జరగకుండా నంద్యాల తాలూకా సిఐ రవీంద్ర, మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్‌ల ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త భువనేశ్వర్ రెడ్డి, మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని, మహానంది దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కొమ్మ మహేశ్వర్ రెడ్డి, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



గుండెపోటుతో విఆర్ఎ మృతి

ప్రజాశక్తి - పాములపాడు

మండలంలోని రుద్రవరం గ్రామానికి చెందిన వీఆర్ఏ ఎస్ మహమ్మద్ రఫీ (38) గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రెవెన్యూ శాఖ అధికారులు శాఖా పరమైన తక్షణ ఆర్థిక సహాయాన్ని అంత్యక్రియల నిమిత్తం 15 వేల రూపాయలను డిప్యూటీ తాసిల్దార్ పటాన్ బాబు భార్యకు శుక్రవారం అందజేశారు. రెవెన్యూ శాఖ పరంగా మహమ్మద్ రఫీకి నివాళులర్పించారు. విధుల పట్ల అంకితభావంతో పనిచేశారని ఆకస్మిక మరణం బాధాకరమన్నారు. కుటుం బ సభ్యులకు సంతాపం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ భాస్కర్, విఆర్వోలు కరిముల్లా, నాగభూషణం, వీఆర్ఏ సంఘం అధ్యక్షులు పరమేశ్వరుడు, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ నాయక్, నారాయణ నాయక్, చంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి శివారెడ్డి బాధ్యతలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్



నంద్యాల జిల్లా ట్రాన్స్పోర్ట్ అధికారిగా శివారెడ్డి శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆదోనిలో ఆర్టీవోగా పని చేస్తూ బదిలీపై నంద్యాల జిల్లాకు వచ్చారు. శివారెడ్డి నంద్యాల మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్‌గా పని చేస్తూ పదోన్నతిపై ఆదోని ఆర్టీవోగా వెళ్లారు. అయితే నంద్యాల జిల్లాలో పని చేసిన డిటిసి నిరంజన్ రెడ్డి పదోన్నతిపై వెళ్లడంతో నంద్యాలలో డిటిఓ పోస్టు ఖాళీగా ఉండడంతో ఇంచార్జి డిటిఓగా శ్రీకాంత్‌ను నియమించింది. గత ఆరు నెలలుగా ఇన్చార్జి పాలనలో ఉన్న ట్రాన్స్ పోర్ట్ కార్యాలయానికి ఇకనుండి రెగ్యులర్ డ్యూటీగా శివా రెడ్డి కొనసాగనున్నారు.


అర్చన


సృజనప్రియ

ఇంటర్‌లో గురుకుల విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి-డోన్

ఇటీవల విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో డోన్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల విద్యార్థినులు ప్రతిభ కనపరచినట్లు ప్రిన్సిపల్ ఎం.గీత తెలిపారు. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో బైసిపికి చెందిన ఎం.అర్చన వెయ్యి మార్కులకు గాను 967 మార్కులు సాధించి ప్రథన స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఎం.అశ్విని 948 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. ప్రథమ సంవత్సర ఫలితాల్లో ఎల్.సృజన ప్రియ 470 మార్కులకు గాను 442 మార్కులతో ప్రథమ స్థానంలో, ఎం.అరుణోదయ 439 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఇంటర్‌లో ప్రతిభ కనపరచిన విద్యార్థినులను సిబ్బంది సుస్మిత, మహానంది, వెంకటస్వామి, హెల్త్ సూపర్‌వైజర్ పుష్పవతి అభినందించారు.



వీల్ చైర్స్ పంపిణీ

ప్రజాశక్తి - బేతంచర్ల :

ఫ్లోరైడ్ బాధితులకు వీల్ చైర్స్ రెడ్ క్రాస్ సొసైటీ వారు శుక్రవారం నాడు పంపిణీ చేశారు. బేతంచర్ల మండల పరిధిలోని రహిమాన్ పురం, పెండేకల్ గ్రామాలకు చెందిన పొట్లన్న ,సోమేశ్వరమ్మ మరికొందరు ఫ్లోరైడ్తో దివ్యాంగులుగా ఉన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఫ్లోరైడ్ బారిన పడిన వీల్ చైర్స్‌ను రెడ్ క్రాస్ సభ్యులు దస్తగిరి, సురేంద్రలు అందజేశారు. ఫ్లోరైడ్‌పై కచ్చితంగా బాధ్యత తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సభ్యులు, డాక్టర్ శాంతి గ్రామ ప్రజలకు సూచనలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది అనిత, మానస, దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగు గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - రుద్రవరం : మండలంలోని నరసాపురం గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంలో నవధాన్యాల సాగు-నేల బాగు కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను, పేపర్ పాంప్లెట్స్‌ను మండల వ్యవసాయ అధికారి బి. జ్యోతి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 30 రకాల విత్తనాలు తొలకరి చినుకులకు ముందు భూమి లో చల్లుకుని 45-60 రోజుల తర్వాతా భూమిలో కలియదున్నుకోవడం వల్ల భూ మి సారవంతమై భూసారం పెరుగుతుంది అని అన్నారు. దీని ద్వారా భూమిలో పోషకాలు పెరిగి భూమి సారవంతంగా మారుతుందన్నారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో కెపిపి ప్రణాళికలు తయారు చేస్తున్నారని ప్రతి రైతు ప్రణాళికలు చెప్పాలని కోరారు. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ మహబూబ్ బాష, అహోబిలం హరి ఎంసీఏ శివ శంకర్, లక్ష్మీ చరిత దేవీ, ఐసిఆర్పిలు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలి: టిడిపి

ప్రజాశక్తి - కొత్తపల్లి



నందికొట్కూరు నియోజకవర్గంలో వైసీపీ నాయకులు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని, స్థాయి మరచి విమర్శ చేయడం పద్ధతి కాదని టిడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జయసూర్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో వారు విలేకరులతో మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత మంద్ర శివానందరెడ్డి గౌరు వెంకటరెడ్డిలది అన్నారు. నందికొట్కూరులో వైసిపి నాయకులు నోటికి అడ్డు అదుపు లేకుండా ఇష్ట రాజ్యాంగ మాట్లాడితే వహించే ప్రసక్తి లేదన్నారు. అలాగే మా నాయకులైన మాండ్రశివానందరెడ్డి గౌరు వెంకటరెడ్డి ని విమర్శించి స్థాయి మీది కాదు అన్నారు. నందికొట్కూరు మార్కెట్ యాడ్ వైస్ చైర్మన్ రమేష్ నాయుడు గతంలో మీరు విద్యార్థులను అలాగే కాలేజీ యాజమాన్యాన్ని అధ్యాపకులను బెదిరించిన సంగతి అందరికీ తెలుసు అన్నారు. అలాగే గౌరు వెంకట్ రెడ్డి ఫ్లెక్సీ లలో ఫోటోలు వేయించుకొని ఎన్ని నీచమైన పనులు చేశారో ఒకసారి మీరు విమర్శన చేసుకోవాల్సిందిగా తెలుపుతున్నాను అని తెలిపారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత టిడిపికే సాధ్యమన్నారు. టిడిపి హాయంలో నందికొట్కూరు నియోజవర్గం లోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పరిచినారు అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ జెడ్ వెంకట్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జి లింగస్వామి గౌడ్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎపిఎంను పరామర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

వైయస్సార్ కాంతి పథకం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ తిరుపాల్ రెడ్డిని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పరామర్శించారు. శుక్రవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఈ నెల 21 వ తేదీన నంద్యాలలో మోటర్ సైకిల్‌పై వెళుతుండగా రోడ్డు ప్రమాదంలో ఎపిఎంకు గాయాలు అయ్యాయి. విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే నంద్యాలలో నివాసం ఉంటున్న తిరుపాల్ రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ విధుల పట్ల అంకితభావంతో పనిచేసే అధికారి తిరుపాల్ రెడ్డి అని అన్నారు. ప్రతిరోజు వెలుగు శాఖలో పొదుపు సంఘాలకు ఎన్నో సమస్యలు ఉంటాయని అలాంటి సమస్యలను ఎంతో చాకచక్యంగా పరిష్కారం చేసే అధికారిఅని తెలిపారు. త్వరగా కోలుకొని విధులకు హాజరు కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గుండం నాగేశ్వర రెడ్డి, వైసిపి నాయకులు బండి బ్రహ్మానందరెడ్డి, యామ మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - ఆత్మకూర్




ఆత్మకూరు పట్టణంలోని సీనియర్ ఖోఖో క్రీడాకారులు జాతీయ, యూనివర్సిటీ పోటీలలో పాల్గొన్న క్రీడాకారులకు కర్నూలు జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.ప్రభాకర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. సక్రు నాయక్ శుక్రవారం క్రీడా దుస్తులను పంపిణీ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంత క్రీడాకారులు భవిష్యత్తులో ఆత్మకూరు పట్టణానికి జిల్లాకు మంచి పేరు తీసుకుని వచ్చే విధంగా జాతీయస్థాయి పోటీలలో పాల్గొని తమ ప్రతిభను కనపర్చాలని జాతీయ స్థాయిలో విజయాలు సాధించినట్లయితే క్రీడాకారులకు అనేక అవకాశాలు భవిష్యత్తులో ఎదగడానికి వస్తాయన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించారు.



పాలీసెట్ ఉచిత పుస్తకాల పంపిణీ : ఎంపీపీ

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండలంలో విద్యార్థి కోసం జగనన్న ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని బేతంచెర్ల మండలం ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. బేతంచర్ల పట్టణంలోని శ్రీ శేషారెడ్డి పూర్వ హైస్కూల్ నందు పాలిటెక్నిక్ కళాశాల తాత్కాలిక ఏర్పాటు చేసిన విషయమే. శిక్షణ పొందుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా పాలీసెట్ స్టడీ మెటీరియల్ పుస్తకాలను శుక్రవారం నాడు ఓఎస్డి రాజశేఖర్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ నాగభూషణం రెడ్డి, చైర్మన్ చలం రెడ్డి మాట్లాడుతూ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ పార్టీ సీనియర్ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, ముస్లిం మైనార్టీ జిల్లా నాయకులు మూర్తి జావలి, వాల్మీకి పెరేషన్ రాష్ట్ర నాయకులు మురళి కృష్ణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



వైసిపితో సంక్షేమం

ప్రజాశక్తి - అవుకు

వైసిపి ప్రభుత్వంతోనే సంక్షేమ పథకాలు సాధ్యం అని వైసిపి నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అన్నవరం, నిచ్చెన మెట్ల, చిన్న కొట్టాల, వేములపాడు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉమ్మడి జిల్లాల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ వాలంటీర్లు, పంచాయతీ సెక్రెటరీ తో కలిసి ఇంటింటికి తిరిగి వాళ్ళ అనుమతితో ప్రతి ఇంటికి స్టిక్కర్లను అంటించే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి వారి మొబైల్ లతో మిస్డ్ కాల్ చేపట్టారు.

నేడు ఆర్‌టిసి షాపులకు టెండర్లపై సమావేశం

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

డిపో పరిధిలో గల 15 షాపులకు టెండర్లకు సంబంధించి నేడు శనివారం ఉదయం 11 గంటలకు డిపో మేనేజర్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు కోయిలకుంట్ల ఆర్టీసీ డిపో మేనేజర్ తిరుపతయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కోయిలకుంట్ల డిపో పరిధిలో గల 15 షాపులకు జిల్లా ప్రజా రవాణా అధికారి, నంద్యాల కార్యాయలము ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు టెండర్లకు పిలవడం జరిగిందన్నారు. డిపో నందు టెండరు ఫారములు అమ్ముటకు చివరి తేది మే2 , 3వ తేదిన జిల్లా ప్రజా రవాణా అధికారి, నంద్యాల కార్యాయలము నందు సీలు ఫారములు చేసిన టెండరు బాక్సు నందు మధ్యాహ్నము 2 గంటలలోపల వేయవలెను అన్నారు. మధ్యాహ్నము 3 గంటల తర్వాత టెండరు బాక్సు తెరచి ఫలితాలను ప్రకటించడం జరుగుతుందన్నారు.

ఒలంపియాడ్‌లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని రవ్వలకొండ మీద ఉన్న మోడల్ స్కూల్ విద్యార్థులు ఒలంపియాడ్ ఎగ్జామ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించిన్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రామలక్ష్మి శుక్రవారం తెలిపారు. 9వ తరగతి నుండి హరిణి, మల్లేశ్వరి, హిమజ ప్రియా, హాజరబి, లక్ష్మీ ప్రసన్న, శ్రావణి, తేజేశ్వరి, ఎనిమిదవ తరగతి నుండి మేధాశ్రీ , ఏడవ తరగతి నుండి సాయి చైతన్య, ఆరవ తరగతి నుండి బాలాజి నాయక్, నాగ సంపత్, శివ నందు,లు వివిధ సబ్జెక్టులలో గోల్డ్ మెడల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రిన్సిపల్ రామలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులకు గోల్డ్ మెడల్ తో పాటు సర్టిఫికేట్లను అందజేశారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ రామలక్ష్మి, ఉపాధ్యాయ బందం అభినందించారు.





సూర్య నందీశ్వరునీ సన్నిధిలో ఎమ్మెల్యే శిల్పా

ప్రజాశక్తి - మహానంది

మండలంలోని నందిపల్లె పంచాయతీలో గల నవనందులలో తొమ్మి దవ నంది శ్రీ సూర్య నందీశ్వర స్వామి వారిని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారి సన్నిధిలో జరుగు పలు శుభాకార్యములకు కళ్యాణ, భోజన వసతి నూతన సముదాయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీశైలం నియోజకవర్గ సమన్వయ కర్త శిల్పా భువనేశ్వర రెడ్డి, రామక్రిష్ణ విద్యా సంస్థల అధినేత రామక్రిష్ణ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, మండల వైస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - బనగానపల్లె రూరల్

పుట్టినరోజు సందర్భంగా స్థానిక ప్రియదర్శిని వృద్ధాశ్రమంలో, పట్టణములోని అంగనవాడి-6 సెంటర్లో పిల్లలకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణములోని శ్రీ సాయినాథ్ మెడికల్ స్టోర్ యాజమాన్యం సి.చంద్రశేఖర్ కొమ్మిరెడ్డి రమాదేవి దంపతుల కూతురు డాక్టర్ శ్రీవిద్య పుట్టినరోజు సందర్భంగా 30 మంది అనాథ వృద్ధులకు ఉచిత అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టినరోజు సందర్భంగా వృథా ఖర్చులు చేయకుండా, సేవా కార్యక్రమాలు చేయడం వల్ల మంచి సమాజానికి శ్రీకారం చుడుతుందని వారు తెలిపారు. ఈ యాంత్రిక వ్యవస్థలో దినదిన మానవతా విలువలు తగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కావున మానవతా విలువలో పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రియదర్శిని వృద్ధాశ్రమం చైర్మన్ విజయలక్ష్మి, మేనేజర్ మహేంద్ర,



నిర్వాకరాలు కల్పనా, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణాన్ని అడ్డుకోవడం సరికాదు

ప్రజాశక్తి - పాములపాడు : మండలంలోని రుద్రవరం గ్రామంలో పురాతన శివాలయాన్ని పునర్ నిర్మించడానికి కొందరు అడ్డుకోవడం సరికాదని గ్రామస్తులు పేర్కొన్నారు. ఆలయ పునర్నిర్మాణాన్ని అడ్డుకొని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంపై రుద్రవరం గ్రామ పెద్దలు, ప్రజలు పాములపాడు మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుద్రవరం గ్రామ శివాలయాలనికి, లింగమయ్య స్వామికి సంబంధించిన స్థలాన్ని కొందరు గ్రామస్తులు వితండవాదం చేస్తున్నారని అన్నారు. దేవాలయ నిర్మాణంపై రాజకీయాలు చేయడం తగదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు జాల అంకన్న,జాల రామసుబ్బయ్య,జాల రఘురాముడు ధర్మకర్తలు జాల వెంగన్న,రాజా గౌడ్, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.